# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 11-10-2024 15/-


# చెప్పేదొకటి చేసేదొకటి

## తల్లిదండ్రులే స్వర్గానికి సోపానాలు






సమాజీవన భావాల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 41 హైదరాబాద్
శుక్రవారం 11 అక్టోబర్ 2024 రూ.15-00
7 రబీ ఉస్సాని 1446 హిజ్రీ

**తొలిగీటు**

## నిరుపేదలకు, అవసరార్థులకు అన్నం పెట్టండి (మీ హృదయం మెత్తబడుతుంది).

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**


**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**

కథ




11

**సంబంధ బాంధవ్యాలు**

## లోపల...

| | | |
|---|---|---|
| వార్ | ...... | 04 |
| చెప్పేదొకటి చేసేదొకటి | ...... | 05 |
| దేవుని బెబ్బులి!! – 49 | ...... | 08 |
| నైతికత, విశ్వాసం... ఉత్తమ జీవితానికి మార్గదర్శకాలు | ...... | 14 |
| తల్లిదండ్రులే స్వర్గానికి సోపానాలు | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| చరితార్థులు–2 : డాక్టర్ సయ్యద్ ఇక్రాం రసూల్ | ...... | 21 |
| అశ్లీలతకు వ్యతిరేకంగా ఓ గొప్ప ఉద్యమం అవసరం–3 | ...... | 22 |
| స్వేచ్ఛ (కవిత) | ...... | 25 |
| జ్ఞానజ్యోతిని వెలిగించాలి.... – 2 | ...... | 26 |
| రాజకీయ కల్తీ లేకుండా చూడాలి | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| శాంతియుత జీవనమే మనుగడకు భరోసా | ...... | 34 |




**బుల్డోజింగ్ ఆపండి**
**- హైకమాండ్ ?**

రేవంతుకు అక్షింతలు
వేసిందట హైకమాండు
కూల్చుడు ఆపాలంటు
జనం నుండి డిమాండు!
ఉద్దేశ్యము మంచిదైన
బాగలేదటలే విధానం
ఒప్పించి మెప్పించాలి
అదే అసలు ప్రధానం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# వార్

**పశ్చిమాసియాలో** ఇప్పుడు జరుగుతున్నది తీవ్రపరిణామాలకు దారితీసే దుస్సంఘటనల పరంపర. డెమస్కస్‌లోని ఈరాన్ రాయబార కార్యాలయంపై దాడి చేయించినప్పుడే ఇస్రాయిల్ ప్రధాని నెతన్యాహుకు తానేం చేశాడో బాగా తెలుసు. ఆ దాడిలో ఈరాన్ సైనికాధికారి బ్రిగేడియర్ జనరల్ ముహమ్మద్ రెజా జాహిదీ మరణించారు.

గాజాపై బాంబుల వర్షం కురిపించి సాధించింది పసిపాపలను చంపడం తప్ప మరేమీ కాదు. అక్కడ పాలస్తీనా పౌరులకు కోల్పోయేది ఏదీ మిగల్లేదు. వారు వెనక్కి తగ్గనూ లేదు. పైగా గాజాపై దాడి తర్వాత హమాస్ లో చేరేవారి సంఖ్య పెరిగింది. గాజాలో సాధించింది ఏదీ లేని పరిస్థితిలో, నెతన్యాహు పట్ల ఇస్రాయిల్‌లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో, బందీలను విడుదల చేయించాలన్న ఒత్తిడిని తట్టుకోడానికి డెమస్కస్‌లో ఈరాన్ రాయబార కార్యాలయంపై దాడి చేయించాడు. డెమస్కస్ పై దాడి తర్వాత ఈరాన్ దాడి, ప్రతిగా అమెరికా ఈరాన్‌పై దాడి ఇలా జరిగితే ఇస్రాయిల్‌లో తనకు ధోకా ఉండదన్నది ఈ కుట్ర. అమెరికాకు కూడా ఇదంతా తెలుసు. ఈ దాడికి బదులుగా ఈరాన్ చేసిన దాడి చాలా వ్యూహాత్మకంగా ఖచ్చితమైన సందేశం ఇచ్చే దాడి. ఆ దాడితో ఇస్రాయిల్‌లోనే కాదు ఇస్రాయిల్‌కు వత్తాసు పలికే మధ్యప్రాచ్య దేశాల్లో దేనిపై అయినా ఎప్పుడైనా దాడి చేసే సత్తా తమకుందని చాటి చెప్పింది. అప్పుడు చేసిన దాడిలో కాలం చెల్లిన చవుకైనా డ్రోన్లు వాడింది. ఇస్రాయిల్‌కు ఆత్మరక్షణ చేసుకునే పూర్తి అవకాశాన్ని ఇచ్చింది. ఆ దాడిని తట్టుకోడానికే ఇస్రాయిల్‌కు నాలుగు దేశాలు సహాయపడ్డాయి. ఆ దాడిలోనే నెవాతిమ్ ఎయిర్ బేస్ ను దెబ్బతీశారు.

ఆ తర్వాత జరిగిన సంఘటనల పరంపర హమాస్ నాయకుడు హానియా హత్య, లెబనాన్ లో వరుసగా పేజర్ పేలుళ్ళు, నిజానికి ఈ పేలుళ్ళు ఉగ్రవాదచర్యలుగా భావించాలి, ఆ పిదప హిజ్బుల్లా నాయకుడు నస్రల్లా హత్య ఇవన్నీ జరిగాయి. ఈరాన్ తక్షణం ప్రతిస్పందించలేదు. ఈ సంఘటనలన్నింటి వెనుక నెతన్యాహు అధికార దాహం తప్ప మరేమీ లేదు. ఇస్రాయిల్ నిత్యం యుద్ధంలో ఉండడం వల్ల నెతన్యాహు అధికారంలో కొనసాగగలడు. తన అవినీతిని దాచిపెట్టుకోగలడు. గాజాలో దారుణమైన వైఫల్యాలను దాచిపెట్టుకునే ఈ ప్రయత్నాల్లో భాగంగానే లెబనాన్ పై సైన్యాన్ని నడపాలనే నిర్ణయం తీసుకున్నాడు.

లెబనాన్‌లో ప్రవేశించిన ఇస్రాయిల్ సైన్యం తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవడమే కాదు, ఇస్రాయిల్ సైనికులు మరణిస్తున్నారు, మరోవైపు ఈరాన్ హిజ్బుల్లా నాయకుడి హత్యకు ప్రతీకారంగా ఇస్రాయిల్‌పై బాలిస్టిక్ మిస్సైళ్ళతో విరుచుకుపడింది. ధ్వని వేగంకన్నా ఐదు రెట్ల వేగంతో ప్రయాణించే ఈ మిస్సైళ్ళను అడ్డుకోవడంలో ఇస్రాయిల్ రక్షణ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని వార్తలు వచ్చాయి. ఇస్రాయిల్ సైనిక స్థావరాలే ప్రధానంగా దాడి చేయడం ద్వారా ఈరాన్ మరో సందేశాన్ని కూడా ఇచ్చింది. తలచుకుంటే, ఇస్రాయిల్ మాదిరిగా జనావాసాలపై దాడి చేయడం కూడా చేయగలమనే సందేశం అది. ఇస్రాయిల్ దాడులన్నీ స్కూళ్ళపైన, ఆసుపత్రులపైన, జనావాసాలపైనే కొనసాగాయన్నది గమనార్హం. హైపర్ సానిక్ మిస్సైళ్ళను అడ్డుకోవడానికి అత్యంత ఖరీదైన ఐరన్ డోమ్ ఖర్చు కూడా ఆర్థికంగా ఇస్రాయిల్ నడ్డి విరుస్తోంది.

అమెరికా నిస్సిగ్గుగా ఇస్రాయిల్ దౌర్జన్యాలకు మద్దతిస్తోంది. అమెరికా ఎన్నికలు జరగబోతున్నాయి. కాబట్టి ఈ ఎన్నికలు ముగిసే లోపు యుద్ధం ముగిసే సూచనలు లేవు. ఈ యుద్ధం పశ్చిమాసియాలో సమీకరణాలను మార్చేయవచ్చు. గల్ఫ్‌లో ఉన్న అమెరికా స్థావరాలు కూడా ఇప్పుడు దాడుల ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. అమెరికా నౌకలను హూతీలు లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు.

మరోవైపు బ్రిక్స్ బలపడుతోంది. అంతర్జాతీయ మారకంగా డాలర్ బలహీనపడుతోంది. ఇస్రాయిల్‌కు బిలియన్ల సహాయం చేస్తున్న అమెరికా నేతలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. రష్యా చైనాలు మధ్యప్రాచ్యంలో తమ పలుకుబడి పెంచుకుంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆలోచిస్తే రానున్న కాలంలో మధ్యప్రాచ్యంలో సమీకరణాలు శరవేగంగా మారే సూచనలున్నాయి.

అబ్దుల్ వాహెద్

# చెప్పేదొకటి చేసేదొకటి

**ఇటీవల** ఒక వార్త వచ్చింది. నరేంద్రమోడీ ప్రభుత్వం ఎగుమతులు పెంచుకునే ప్రయత్నాల్లో ఉంది. పదిహేను ముస్లిం దేశాలకు హలాల్ మాంసం ఎగుమతి చేయాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్ 16 నుంచి ఈ ఎగుమతులు ప్రారంభమవుతాయని వార్త. బిజినెస్ స్టాండర్డ్ పత్రికలో అక్టోబర్ 3వ తేదీన ఈ వార్త ప్రచురించింది.

ఈ వార్త చదివిన తర్వాత చాలా మందికి హలాల్ ఉత్పత్తులపై ఇటీవలి గగ్గోలు తప్పక గుర్తుకు వచ్చి ఉంటుంది. మచ్చుకు కొన్ని వార్తలు చూద్దాం. గత సంవత్సరం ఉత్తరప్రదేశ్ యోగీ ప్రభుత్వం హలాల్ ఉత్పత్తులపై నిషేధం విధించింది. ఆ వెంటనే అధికారులు వీరోత్సాహం ప్రదర్శించిన వార్తలు కూడా వచ్చాయి. అయితే అప్పట్లోనే హలాల్ నిషేధాలు ఎగుమతులకు వర్తించవని అశ్వత్థామ హతః తరహాలో వినిపించీ వినిపించకుండా చెప్పారు. దీనిపై జరగవలసిన మతతత్వ రాజకీయాలు నిస్సిగ్గుగా చేశారు. హలాల్ పై హంగామా చాలా కాలంగా కొనసాగుతూ వస్తోంది. మార్చి 2022లో బీజేపీ నాయకుడు, జాతీయ ప్రధానకార్యదర్శి హోదాలో సి.టి.రవి హలాల్ అనేది ఆర్థిక జిహాద్ అన్నాడు. ఆ తర్వాత హిందువులు హలాల్ ఉత్పత్తుల్ని బాయ్‌కాట్ చేయాలన్న నినాదాలూ వినిపించాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం హలాల్ నిషేధం విధించిన తర్వాత మహారాష్ట్రలో బీజేపీ నాయకుడు నితీష్ రానే మహారాష్ట్రలో కూడా హలాల్ నిషేధం విధించాలని చెప్పాడు. హలాల్ సర్టిఫికేషన్ కోసం సేకరిస్తున్న సొమ్మును ఉగ్రవాదానికి ఉపయోగిస్తున్నారనే తీవ్రమైన ఆరోపణలు కూడా చేశాడు. ఏళ్ళ తరబడి హలాల్ ఉత్పత్తులపై హంగామా చేస్తూ వస్తున్న వారు, గుట్టుచప్పుడు కాకుండా హలాల్ ఎగుమతులకు తలుపులు బార్లా తెరిచారు. హలాల్ సాకుతో ముస్లిములపై దాడులు చేస్తూ వచ్చిన బీజేపీ పార్టీ అధికారంలో ఉన్న ప్రభుత్వమే ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో హలాల్ ఉత్పత్తుల ఎగుమతులకు సదుపాయాలు కల్పిస్తోంది.

హలాల్ మాంసం ఎగుమతులకు సంబంధించి గైడ్ లైన్స్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఇటీవల జారీ చేసింది. హలాల్ మాంసం ఎగుమతుల విషయంలో ప్రభుత్వం గుర్తించిన 15 దేశాలేవంటే-బహ్రెయిన్, ఈరాన్, ఇరాక్, కువైట్, మలేషియా, బంగ్లాదేశ్, ఇండోనేషియా, జోర్డాన్, ఒమాన్, ఫిలిప్పిన్స్, ఖతర్, సౌదీ అరేబియా, సింగపూర్, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్. హలాల్ ఉత్పత్తులకు ఈ దేశాల్లో పెద్ద మార్కెట్ ఉంది. ఈ దేశాల్లో ముస్లిం జనాభా పెద్ద సంఖ్యలో ఉంది. హలాల్ ఉత్పత్తులకు చాలా డిమాండ్ ఉంటుంది.

ఈ విషయం గురించి మరింత చర్చించే ముందు అసలు హలాల్ అంటే ఏమిటో తెలుసుకుందాం. హలాల్ అనేది అరబి పదం. ఈ పదానికి అర్థం "అనుమతించబడినవి". ఇస్లామీయ చట్టాల ప్రకారం అనుమతించబడిన ఉత్పత్తులను హలాల్ ఉత్పత్తులు అంటారు. చాలా మంది హలాల్ అంటే మాంసాహారానికి సంబంధించిందిగా భావిస్తారు. కాని ముస్లిములకు హలాల్ అంటే కేవలం మాంసాహారానికి సంబంధించింది మాత్రమే కాదు. హలాల్, హరాం అనే విచక్షణ, అంటే అనుమతించ బడినవి, నిషేధించబడినవి అనే విచక్షణ ప్రతి ముస్లిం ప్రతి పని విషయంలోను దృష్టిలో ఉంచుకుంటాడు. ఇది డిఎన్ఏలో భాగమైపోయి ఉంటుంది. మాంసాహారానికి సంబంధించి తినదగిన జంతువులు, వాటిని వధించే పద్ధతి, సంకల్పాలూ వగైరా నియమాల ప్రకారం ఉన్న మాంసాహారం హలాల్. ఇంతకు ముందు చెప్పినట్లు ఇది కేవలం మాంసాహారానికి సంబంధించింది మాత్రమే కాదు, చాలా విషయాలకు వర్తిస్తుంది. ఉదాహరణకు మద్యం నిషిద్ధం. కాబట్టి మద్యానికి సంబంధించిన ఎలాంటి పనులైనా, అంటే అమ్మడం, కొనడం, తాగడం మాత్రమే కాదు, మద్యవ్యాపారానికి సంబంధించి ఎలాంటి ప్రమేయమైనా సరే హలాల్ కాదు. అది హరాం క్రిందికి వస్తుంది. అలాగే వడ్డీ నిషిద్ధం. వడ్డీకి సంబంధించిన ఎలాంటి జోక్యం ఉన్న వ్యవహారమైనా సరే హరాం. ఏదైనా వస్తు ఉత్పత్తిలో అల్కాహాల్ లేదా పందిమాంసం, కొవ్వు ఉపయోగించి ఉంటే అది హలాల్ కాదు. ఇది తినే తాగే ఉపయోగించే వస్తువులకు సంబంధించినది మాత్రమే కాదు. వ్యాపారం చేస్తుంటే హలాల్ నియమనిబంధనలను పాటించాలి. స్టాక్ మార్కెట్, ట్రేడింగ్‌లకు సంబంధించి కూడా హలాల్ ట్రేడింగ్ మార్గదర్శకత్వం ఇచ్చే యాప్‌లు ఉన్నాయి. చాలా మంది ముస్లిములు వీటికి ఖచ్చితంగా కట్టుబడతారు. కాని హలాల్ గురించి గగ్గోలు చేసేవారు సాధారణంగా హలాల్ అంటే మాంసాహారం మాత్రమే అనుకుని దాని చుట్టూ మాత్రమే మాట్లాడతారు. హలాల్ అనేది ముస్లిముల జీవితంలో భాగం. ప్రతి పనిలో వర్తించే నియమనిబంధనలివి.

సరే ఇక అసలు విషయానికి వద్దాం – ఇప్పుడు హలాల్ మాంసం ఎగుమతులకు మార్గదర్శకాలు జారీ చేశారు. పైన పేర్కొన్న దేశాలకు హలాల్ మాంసం ఎగుమతి చేసేవారు ఖచ్చితమైన ధృవీకరణ పత్రాలు తీసుకోవలసి ఉంటుంది. దీనివల్ల భారత హలాల్ ఉత్పత్తుల విశ్వసనీయత పెరుగుతుంది. హలాల్ ఎగు మతులపై ఇంత శ్రద్ధ ఎందుకంటే ఇది చాలా పెద్ద మార్కెట్. భారతదేశంలో హలాల్ సర్టిఫికేషన్ విషయంలో అనేక సంవత్స రాలుగా గగ్గోలు పెట్టిన వారు ఇప్పుడు హలాల్ సర్టిఫికేట్లతో ఎగుమతుల విశ్వసనీయత పెంచుకోవాలనుకుంటున్నారు. హలాల్ అలవాట్లకు సంబంధించి ముస్లిములపై దాడులు చేసినవారు, ముస్లిములను హేళన చేసినవారు, ముస్లిములను నేరస్తుల్లా చూసినవారు, ముఖ్యంగా సోషల్ మీడియాలో వీరంగాలు వేసినవారు ఇప్పుడేమంటారో చూడాలి. పరివార శక్తులు హలాల్ ఉత్పత్తులపై చేసిన విద్వేష ప్రచారం అందరికీ తెలిసిందే. హలాల్ ఉత్పత్తులు ముస్లిమేతరుల పట్ల వివక్ష అంటూ విరుచుకుపడ్డారు. పశువధ చేసే పద్ధతి అమానుషంగా ఉంటుం దన్నారు. హలాల్ ఉత్పత్తులను బాయ్‌కాట్ చేయాలని పిలుపు నిచ్చారు.

ఇక్కడ అప్రస్తుతమైన మరో విషయం చెప్పాలి. ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు దట్టంగా అలుముకుని ఉన్నాయి. లెబనాన్‌పై ఇస్రాయీల్ దాడులు చేస్తుంటే, ఇస్రా యీల్‌పై ఈరాన్ విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో ఇస్రాయీల్‌పై అపార సానుభూతి చూపిస్తూ, ఇస్రాయీల్ తమకు ఆప్తదేశం అనే స్థాయిలో కొందరు మాట్లాడుతున్నారు. ఇస్రాయీల్ లోని యూదులు కాని, యూదులెవరైనా కాని వారి ఆహారనియమాల ప్రకారం కోషర్ పద్ధతిలో వధించిన పశు మాంసాన్ని మాత్రమే తింటారు. కోషర్ సర్టిఫికేషన్ కూడా జరుగుతుంది. నిజానికి కోషర్ నిబంధనలు మరింత కఠినంగా ఉంటాయి. కోషర్ సర్టిఫికేషన్ లేకపోతే యూదులు కూడా తినరు. ఈ మతపరమైన నిబంధనను అందరూ గౌరవించాలి. ముస్లిములు కూడా దీనిపై ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదు. సౌదీ తదితర ముస్లిం దేశాల్లో కూడా యూదులకు కోషర్ సర్టిఫికేషన్ ఉన్న ఆహార ఉత్పత్తులు లభిస్తాయి. కేవలం శాకా హారం మాత్రమే తినేవారు కూడా ఇలాంటి సర్టిఫికేషన్ వ్యవస్థ లను ఏర్పాటు చేసుకుంటే అనేక వివాదాలను నివారించవచ్చు.

కేవలం ముస్లిములను విలన్లుగా చిత్రీకరించడం మాత్రమే ప్రధాన రాజకీయ ఆయుధంగా మారిన నేటి పరిస్థితుల్లో హలాల్ ఉత్పత్తులపై గగ్గోలు ఓట్ల వాన కురిపిస్తుందనుకునేవారు హలాల్ ఉత్పత్తులపై హంగామా చేశారు. కాని వ్యాపారలాభాలు వీళ్ళకు కూడా కావాలి. కాబట్టి అంతర్జాతీయంగా హలాల్ పరిశ్రమకు ఉన్న మార్కెట్ వీళ్ళకు కూడా కావాలి. అంతర్జాతీయంగా హలాల్ ఉత్పత్తులకు డిమాండ్ భారీగా పెరుగుతోంది. దేశంలో కూడా ముస్లిములు హలాల్ ఆహారమే తింటారు. మార్కెట్ అంచనాల ప్రకారం ప్రపంచంలో హలాల్ ఆహారం మార్కెట్

విలువ 2021లో 1978 బిలియన్ డాలర్లు. 2027 నాటికి ఇది 3,907 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని తెలుస్తోంది. ఈ మార్కెట్ అంతా కేవలం ముస్లిం మెజారిటీ దేశాల్లోనే ఉందనుకుంటే పొరబాటు. ముస్లిమేతరులు కూడా చాలా మంది హలాల్ ఆహారాన్ని ఇష్టపడుతున్నారని, ఆహారం తయారీ ప్రమాణాలతో పాటు ఆరోగ్యానికి మంచిదని భావిస్తున్నారని తెలుస్తోంది. గూగుల్ చూస్తే చాలా వివరాలు తెలుస్తాయి.

ముస్లిముల హలాల్ అలవాట్లపై గగ్గోలు చెంది, హలాల్ అంటే ఆర్థిక జిహాద్ అని దుష్ప్రచారం చేసి, ముస్లిములను విలన్లుగా చిత్రీకరించిన తీరుకు, కరోనా జిహాద్ అంటూ కరోనా కాలంలో ముస్లిములను విలన్లుగా చిత్రీకరించిన తీరుకు ఉన్న పోలికలను గమనిస్తే దేశంలో నేడున్న పరిస్థితి ఏమిటో స్పష్టంగా అర్థమవుతుంది. కాని అంతర్జాతీయంగా ఎగుమతులకు హలాల్ సర్టిఫికేట్ అవసరమైనప్పుడు ఈ శక్తులకు వత్తాసు పలికే వ్యాపారవేత్తలు కూడా హలాల్ సర్టిఫికేట్లతో ఎగుమతులు చేయడానికి పోటీలు పడతారు. 'అల్ కబీర్' పశువధ శాల గురించి తెలియని వారెవ్వరు? ఈ పశువధశాల యజమానులెవరు? ఎగుమతుల విషయానికి వస్తే హలాల్ కోసం పోటీపడే వారు, ఇక్కడ ముస్లిములను హలాల్ పేరుతో విలన్లుగా చిత్రీకరించడం హిపోక్రసీ. ఎగుమతులు పెంచడానికి హలాల్ సర్టిఫికేషన్ విషయంలో తగిన మార్గదర్శకాలను జారీ చేయడం ఆహ్వానించదగిన పరిణామమే. దాంతో పాటు దేశంలో హలాల్ సాకుతో మతతత్వ విద్వేష ప్రచారాన్ని అడ్డుకోవడం కూడా అవసరమే.

✤


## ఖుర్ఆన్ అవగాహనం (తఫ్హీముల్ ఖుర్ఆన్)

(1 నుండి 10వ సంపుటం వరకు వివరాలు )

| సంపుటం | సూరా పేర్లు | సూరాలు | పేజీలు | హదియ |
|---|---|---|---|---|
| 1. | 1. అల్ ఫాతిహా 2. అల్ బకర 3. ఆలి ఇమ్రాన్ | 3 | 266 | 300-00 |
| 2. | 4. అన్ నిసా 5. అల్ మాఇద 6. అల్ అన్ఆమ్ | 3 | 268 | 300-00 |
| 3. | 7. అల్ ఆరాఫ్ 8. అల్ అన్ఫాల్ 9. అత్ తౌబా 10. యూనుస్ 11. హూద్ 12. యూసుఫ్ | 6 | 440 | 400-00 |
| 4. | 13. అర్ రా'ద్ 14. ఇబ్రాహీమ్ 15. అల్ హిజ్ర్ 16. అన్ నహ్ల్ 17. బనీ ఇస్రాయీల్ 18. అల్ కహ్ఫ్ 19. మర్యమ్ 20. తాహా 21. అల్ అన్బియా | 9 | 424 | 400-00 |
| 5. | 22. అల్ హజ్జ్ 23. అల్ మూ'మినూన్ 24. అన్ నూర్ 25. అల్ ఫుర్కాన్ 26. అష్ షుఅరా 27. అన్ నమ్ల్ | 6 | 422 | 250-00 |
| 6. | 28. అల్ కసస్ 29. అల్ అన్కబూత్ 30. అర్రూమ్ 31. లుక్మాన్ 32. అస్ సజ్దా 33. అల్ అహ్జాబ్ 34. సబా 35. ఫాతిర్ | 8 | 424 | 400-00 |
| 7. | 36. యాసీన్ 37. అస్సాఫ్ఫాత్ 38. సాద్ 39. అజ్ జుమర్ 40. అల్ మూ'మిన్ 41. హామీమ్ అస్ సజ్దా 42. అష్ షూరా 43. అల్ అహ్కాఫ్ 44. అద్ దుఖాన్ 45. అల్ జాసియహ్ 46. అల్ అహ్కాఫ్ 47. ముహమ్మద్ | 12 | 456 | 400-00 |
| 8. | 48. అల్ఫత్హ్ నుండి 59. అల్ హష్ర్ | 12 | 408 | 400-00 |
| 9. | 60. అల్ ముమ్తహీన నుండి 77 అల్ ముర్సలాత్ | 18 | 412 | 400-00 |
| 10. | 78 అన్ నబా నుండి 114 అన్ నాస్ వరకు | 37 | 420 | 400-00 |

3,650-00

డిస్కౌంటు తరువాత

2,190-00

**TELUGU ISLAMIC PUBLICATIONS TRUST**

Central Bank of India, Noor Khan Bazar Branch, Hyderabad

A/c. No. 1042789779 IFSC Code. CBIN0282407

మరిన్ని వివరాలకు సంప్రదించండి: ✆ 9700255736

పోస్టల్ చార్జీలు అదనం

ధరిలో శుభవార్త

అధ్యాయం -18

49

1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎమ్. మలిక్

## 2. సంధి ప్రయత్నాలు

### జమల్ (ఒంటె) పోరాటం

మహనీయ అలీ(ర)కు బస్రా పరిస్థితులు తెలియగా ఆయన తన వెంట కొందరు సహచరుల్ని తీసుకుని బస్రాకు బయలు దేరారు. దారిలో ఓ చోట మజిలీ వేసి ఆయన మహనీయ అమ్మార్ బిన్ యాసిర్(ర)తో తన జ్యేష్ఠ కుమారుడు మహనీయ హసన్(ర)ని కూఫా నగరానికి పంపారు. అక్కడ తమకు సహాయంగా కొందరిని సమాయత్తపరచి తోడుగా తీసుకు రావాలని. ఇక్కడ ఆ విషయాలను కాస్త వివరంగా పరిశీలించ వలసి ఉంటుంది. ఒక ఉల్లేఖనం ప్రకారం:

“వారిరువురు కూఫాలో మస్జిద్‌కు వెళ్ళారు. అక్కడ మహనీయ హసన్(ర) మింబర్ ఎక్కి నిలబడ్డారు. మహనీయ అమ్మార్(ర) క్రింద. కొందరు మింబర్ చుట్టూ ప్రోగయ్యారు. మహనీయ అమ్మార్(ర) ఇలా చెప్పారు, ‘మహనీయ ఆయిషా(ర) బస్రా వచ్చేశారు. దైవం సాక్షిగా ఆమె మన ప్రవక్త(స)కు ఇహపరాల లోనూ సతీమణియే. ఇక మీరు దైవికంగా పరీక్షకు గురయ్యారు. మీరు మహనీయ అలీ (ర)ని అనుసరిస్తారా లేదా మహనీయ ఆయిషా(ర)నా అన్నదే పరీక్ష’ అని చెప్పారు.”

### సంధి ప్రయత్నం

“బస్రాకు చేరువగా వెళ్ళిన తరువాత మహనీయ అలీ ‘క’కా’ బిన్ అమ్రని మహనీయ ఆయిషా(ర) వద్దకు పంపారు. ఆయన ఆవిడ వద్దకు వెళ్ళి ఆవిడ ఏమి కోరుకుంటున్నారో విచారించారు. ఆమె, తాను శ్రేయాన్నే కాంక్షిస్తున్నట్లు చెప్పారు. మహనీయులు తల్హా, జుబైర్ కూడా అదే విధంగా పలికారు. క’కా’, శ్రేయం అంటే మీ ఉద్దేశం ఏమిటీ అని అడిగారు. ఆమె, “అపరాధులకు శిక్ష విధించి మరి ఖలీఫా హత్యలో పాల్గొన్న వారి నుంచి రక్త పరిహారం గ్రహించాలి. ఇలా చేయకపోవడం దివ్యకుర్ఆన్‌ని త్యజించడమే అవుతుంది” అన్నారు.

“అప్పుడు క’కా’, ‘ ‘అయితే మీరు బస్రాలోని తిరుగుబాటు దారుల నుంచి స్వయంగానే రక్త పరిహారం గ్రహించడం మొదలెట్టారు, అవునా? ఈ విధంగా అధికారం మీరు చేతిలో తీసుకోకపోయి ఉంటే మీ వాదన బలంగా ఉండేది!” అన్నారు. దానికి మహనీయ తల్హా, “మేము గౌరవ ఖలీఫాను అశక్తులుగా, బలహీనులుగా గమనించాము, అందుకే మరో దారి లేకపోయింది” అన్నారు.

"క'కా' అన్నారు, మీరు ఇక్కడి ఆరు వందల మందిని, వారు మహనీయ ఉస్మాన్(ర) హత్యలో పాల్గొన్నారన్న అనుమానంతో సంహరించారు. అందువల్ల ఆ హతులయిన వారి వారసులు, ఆరు వేల మంది మీకు విరోధులయి పోయారు. మీరు ఓ వ్యక్తిని పట్టుకోదలచినప్పుడు ఆ ఆరు వేల మంది అతనికి తోడ్పాటు అందజేశారు. అందువల్లనే మీరు అతన్ని అరెస్టు చేయలేకపోయారు".

"మా ఉద్దేశంలో మనం ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఒకటే దారి. మన సముదాయం ఛిన్నాభిన్నం కారాదు. మనం సమైక్యమవ్వాలి. సమైక్య లక్ష్యాల సాధనకు కృషి చేయాలి. అప్పుడే మనం కోరే లక్ష్యం సాధించగలము. దైవ సందేశహరుల సముదాయం కొరకు అది శుభ దాయకమవుతుంది. పీడిత ఖలీఫా హంతకుల నుంచి పరిహారమూ సాధ్యమవుతుంది. ఇతర సకల సదుద్దేశాలూ సాధించగలము".

"నేను దైవం పేరు మీదుగా గౌరవనీయులయిన మిమ్మల్ని అర్థిస్తున్నాను, దయచేసి గమనించండి. ఇది ఏదో ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబం వరకు పరిమితమయిన విషయం కాదు. పూర్తి సముదాయానికి సంబంధించిన వ్యవహారం. దీనికి గాను అమీరుల్ మూ'మినీన్ అలీతోపాటు మీరున్నూ కలసి ఓ పాలిసీ రూపొందించవలసి ఉంటుంది. దాన్ని చిత్తశుద్ధితో అమలు పరచి ముస్లిమ్ సముదాయాన్ని ఈ బెడదల నుంచి, దుష్టులయిన విరోధుల బారి నుండి రక్షించ వలసి ఉంటుంది."

## మారు మనసు

"అంతా విన్న తరువాత మహనీయులు ఆయిషా సిద్దీకా(ర), తల్హా(ర), జుబైర్(ర) ఇలా అన్నారు:

"నీ మాటల్లో ముస్లిమ్ సముదాయం కొరకు ఆవేదన, సమస్యల పరిష్కారం కొరకు సామంజస్యత, చిత్తశుద్ధి కాన వస్తున్నాయి. ఈ ఆలోచనలనే మన సోదరులు అలీ కూడా సమర్థిస్తూ ఉన్నట్లయితే సంధి సుసాధ్యమవుతుంది."

క'కా' వెళ్ళి అమీరుల్ మూ'మినీన్‌కు రిపోర్టు ఇచ్చారు. ఆయన ఎంతో సంతసించారు. మరుసటి రోజు బస్రా వైపునకు బయలుదేరవలసిందని ఆదేశించారు. ఇంకా తమ సైన్యంలో ఎవరయినా సబాయీల ముట్టడిలో పాల్గొన్న వారుంటే లేదా మహనీయ ఉస్మాన్ హత్యలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో, నేరుగానో, రహస్యంగానో పాల్గొన్న వారుంటే వారు ఇక్కడే ఉండిపోవాలని, తమ వెంట రాకూడదని కూడా ఆదేశించారు. అయినా ఆయన వెంట 20 వేల మంది ఉన్నారు. అలాగే ఎదుటి వారి వద్ద 30 వేల మంది ముందు నుంచే ఉన్నారు. మొత్తం 50 వేల ముస్లిముల సముదాయం!

## కుట్ర! చిచ్చు!!

ఇలా పరిస్థితులు సత్పరిణామం వైపునకు మరలడం గమనించి అబ్దుల్లా బిన్ సబా, సబాయీల నాయకుడు, అతని అనుచరులు అనుకున్నారు, 'ఇక మనం మన లేము, గమనిస్తూ ఉండండి, ఇరువర్గాలు కలసుకున్నప్పుడు మెల్లిగా పోరు రగలించాలి. సంధి ఏర్పడే ఏ అవకాశమూ మిగుల రాదు.'

మహనీయులు అలీ(ర) ఆయిషా(ర), ఇరువురి సమర్థకులు బస్రా నగరానికి చేరువలోనే ఓ మైదానంలో బస చేస్తున్నారు. సంధీ సందేశ వాహకుల రాక పోకలు సాగుతూనే ఉన్నాయి. అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర), మహనీయ ఆయిషా(ర) వద్దకు వెళ్ళారు. అలాగే మహనీయ ముహమ్మద్ బిన్ తల్హా ఎదుటి వారి పక్షాన మహనీయ అలీ వద్దకు వచ్చారు. సుహృద్భావ పూరిత వాతావరణంలో సవివర సంభాషణ జరిగింది. సంధి కొరకు షరతులన్నీ నిర్ణయమయ్యాయి. ఎంతో రేయి కడచి పోయింది గనక తెల్లవారు సంధి పత్రం పైన సంతకాలు చేయించాలని అనుకున్నారు.

## కుతంత్రానికి ఆహుతి

కాని ఆ రోజు తెల్లవారక మునుపే(హిజ్రీ 36వ సంవత్సరం, జుమాదియుల్ ఆఖిర్, సెప్టెంబర్ 656) యూదు నాయకుడు, అబ్దుల్లా బిన్ సబా, ఇరు పక్షాల సైన్యం పైన దాడి జరిపాడు. ఈ గలభా ఏమిటీ అని మహనీయులు తల్హా, జుబైర్ అడగ్గా సమాధానంగా మహనీయ అలీ సైన్యం దాడి చేసింది అని తెలిసింది. దానికి వారు, మేము ముందే అనుకున్నాము, ఆయనకు తన సహచరుల పైన అదుపు లేదని అన్నారు.

అదే విధంగా మహనీయ అలీ ప్రశ్నకు దాడి జరిగింది అని సమాధానం వచ్చింది. ఆయన కూడా, నాకు ముందే తెలుసు, వారు పోరు చేయకుండా ఉండలేరని అని చెప్పారు. ఆ పైన భయంకర యుద్ధం జరిగింది. అది చరిత్రలో మొదటి దఫా ముస్లిమ్ సముదాయం 50 వేల మంది తమలో తాము ఘర్షించుకుని 10వేల మంది విశ్వాసుల్ని కోల్పోయారు.

అందులో మహనీయులు తల్హా, ఆయన కుమారుడు ముహమ్మద్, తదితర మహామహులయిన సహచర మాన్యులున్నారు.

ఉభయ పక్షాల హతులను ఖననం చేసిన తరువాత మహనీయ అలీ(ర) మహనీయ ఆయిషా(ర) వద్దకు వచ్చారు. ఇద్దరు జరిగినదంతా చర్చించుకున్నారు. అప్పుడు విచారించి ప్రయోజనం లేదు. మదీనా బయలుదేరారు. ఉభయులూ ఎన్నో మైళ్ళు తోడుగా పయనించారు. అప్పుడు మహనీయ అలీ పుత్రులు హసన్, హుసైన్ కూడా వారితోపాటు ఉన్నారు.

ఆ పోరాటంలో మహనీయ ఆయిషా(ర) ఒంటెపై స్వారీ చేస్తూ తన సేనను ప్రోత్సహించడం చేత దాన్ని ఒంటె పోరాటం అంటారు.

## ఓ సంఘటన

ఆ రోజుల్లోనే ఓనాడు మహనీయ అలీ(ర) సోదరులు అకీల్ బిన్ అబూ తాలిబ్ ఎంతో అవసరమయి అమీరుల్ మూ'మినీన్ అలీ(ర) వద్దకు వచ్చి,

“ఎంతో అగత్య పరుణ్ణయి వచ్చాను, దయచేసి ఏమయినా అనుగ్రహించండి” అని విన్నవించుకున్నారు. దానికి అలీ(ర) బాధపడి,

“అన్నయ్యా, ప్రస్తుతం సహనం వహించండి, కొన్నాళ్ళ తరువాత ముస్లిములకు ప్రభుత్వం తరఫున ధనం పంచబడుతుంది. అప్పుడు నాకూ ఎంతో కొంత లభించనుంది. అప్పుడు నా వంతులోనుంచి మీకూ సమర్పించుకుంటాను” అని చెప్పారు.

అయితే అకీల్‌కు అది అనివార్యమయిన అవసరం. అందువల్ల మరోసారి “నాకు ఇప్పుడే కొంతయినా ఇప్పించండి” అన్నారు.

మహనీయ అలీ (ర) చేసేది లేక ఒక వ్యక్తిని పిలిపించి అతనికి, “మా అన్నయ్య అకీల్‌ని బజారుకు తీసుకు వెళ్ళి షాపుల్ని చూపించి, వాటి తాళాలు పగులగొట్టి అక్కడ ఉన్న దాన్ని తీసుకోమని చెప్పు” అన్నారు. ఆ వ్యక్తి అలానే చేస్తానన్నాడు. అది విని అకీల్, నన్ను మా తమ్ముడు దొంగ చేయదలిచాడా? అని పలికి ఆయన, తిరిగి అలీ(ర) వద్దకు వచ్చి, “అమీరుల్ మూ'మినీన్! మీరు నన్ను దొంగను చేయదలిచారా?” అని అడిగారు.

దానికి మహనీయ అలీ(ర), “అయితే మీరు నన్ను దొంగను చేయదలిచారా? తక్షణం ఏమయినా కావాలంటే నేను బైతుల్ మాల్ నుండి జనుల సొమ్మును తస్కరించి మీకు ఇవ్వాలి అంతేగా?” అని అన్నారు!

అకీల్ ఆగ్రహంతో, “మీరు నా అవసరం తీర్చకపోతే నేను ముఆవియా వద్దకు వెడతాను” అన్నారు.

“మీ ఇష్టం వచ్చినట్లు చేయండి” అని సమాధానం ఇచ్చారు ఖలీఫా.

అలాగే అకీల్ ముఆవియా(ర) వద్దకు వెళ్ళి తన అవసరాన్ని చెప్పుకున్నారు. ఆయన వెంటనే ఒక లక్ష ఇచ్చివేశారు. దీనివల్ల అకీల్ అవసరం తీరి పోతుంది. అకీల్‌కు అమితమయిన ఆనందం కలిగింది. అప్పుడు మహనీయ ముఆవియా(ర) ఆయనతో, “ఇక మీరు మింబర్ నెక్కి నా గురించి మీ భావాలను వ్యక్తం చేయండి” అన్నారు.

అకీల్ అలాగే మింబర్ నెక్కి దైవ స్తోత్రం తరువాత, “నేను అలీని ధర్మం పట్ల పరికించాను, ఆయన ధర్మాన్నే గట్టిగా అనుసరించారు, ఆ పైన నేను ముఆవియా ధర్మాన్ని పరికించాను, ఆయన ధర్మం సమక్షంలో నన్ను అనుసరించారు” అని పలికారు. అలా పలికి అకీల్ మింబర్ నుంచి దిగి వచ్చిన తరువాత మహనీయ ముఆవియా, “ఈయన్ని గురించి ఖురైష్ జనులు ఈయన అవివేకులని అంటారు. వాస్తవానికి ఈయనే వారందరి కన్నా తెలివయిన వారు!” అన్నారు.

★★★

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

కథ

# సంబంధ బాంధవ్యాలు

షహనాజ్ బేగం, అనంతపురం

**అప్పుడే బయట్నుంచి** ఇంటికి వచ్చిన జావిద్ తన ముగ్గురు పిల్లలను దగ్గరికి పిలిచి ఇలా చెప్పాడు : ‘‘అయాన్, అయాజ్, ముబీనా.. మీకో గుడ్‌న్యూస్ చెప్పబోతున్నాను. అదేమిటో చెప్పుకోండి’’ అన్నాడు వారిని ఊరిస్తూ.



‘‘ఏమిటా గుడ్‌న్యూస్. చెప్పండి పప్పా.. ప్లీజ్’’ అంటూ తండ్రి దగ్గరికి వచ్చి గారాలు పోతూ అడిగారు.

అతని భార్య సల్మా కూడా దగ్గరికి వచ్చి ఆసక్తిగా చూడసాగింది.

‘సెలవుల్లో మనం ఏదైనా టూర్‌కు వెళ్తున్నామా’ అడిగింది కూతురు ముబీనా.

‘కాదు. మనం సెలవుల్లో మన ఊరికి వెళ్తున్నాము. మన స్వంత ఊరికి. తాత, నానమ్మ- మన బంధువులందరూ ఉన్న ఊరికి. వారందరినీ చూసినట్టవుతుందని ఈ ప్రోగ్రామ్ వేశాను’ అన్నాడు ఉత్సాహంగా. పిల్లల మొహాల్లోకి చూస్తూ.

అతను ఊహించినట్లుగానే వాళ్ళల్లో సంతోషంగానీ, ఉత్సాహం గానీ ఏ కోశాన కనిపించ లేదు. పైగా నీరుగారిపోయినట్లు నిరుత్సాహంగా మొహాలు పెట్టారు. ఏదో ఆశాభంగం చెందినట్లు మొహం పెట్టుకొని ఒకర్నొకరు చూస్తూ కళ్ళలోనే ఏదో మాట్లాడుకున్నట్లు కనిపించింది.

‘పప్పా... నేను రాలేను. సెలవులు ముగియగానే నాకు పరీక్షలు మొదలవుతాయి. నేను చదువుకోవాలి’ అన్నాడు పెద్దాడు అయాన్.

‘నాకూ అంతే. మా క్లాస్ వాళ్ళకి ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయి వచ్చే నెలలో’ అన్నాడు అయాజ్.

అప్పటిదాకా బుంగమూతి పెట్టుకుని కూర్చుని ఉన్న కూతురు ముబీనా ‘నాకూ ఆ ఊరు వెళ్ళటం ఇష్టం లేదు. అక్కడ ఏసీ ఉండదు. ఏసీ లేకుండా నేను ఉండలేను’ అని చెప్పింది.

ఆ ముగ్గురు పిల్లలు స్కూల్ స్థాయిలో చదువుకుంటున్నవారే.

పిల్లల మాటలు విని జావిద్‌కు కోపంతో ఒళ్ళు మండింది. "మీ ఆటలు నా దగ్గర సాగవు. మనం మన ఊరికి వెళ్ళాల్సిందే. గంటలకొద్దీ ఫోన్లతో గడుపుతుంటారు. అప్పుడు గుర్తుకురాని చదువు ఇప్పుడు ఊరికి వెళ్దామంటే గుర్తుకొచ్చిందా? బట్టలు అవీ సర్దుకోండి. మీకు అక్కడ దగ్గర్లో ఉన్న సుందరమైన ప్రదేశాలను చూపిస్తాను. చాచా వాళ్ళతో బాగా ఆడుకోవచ్చు. మీకూ అక్కడ బోలెడు మంది ఫ్రెండ్స్ దొరుకుతారు అంటూ పిల్లలను నయాన భయాన ఊరికి వెళ్ళడానికి అంగీకరింపజేశాడు.

పిల్లలను ఎలాగయినా తమ స్వంత ఊరికి తీసుకువెళ్ళాలనే పట్టుదలతో ఉన్నాడతను. దానికి కారణం లేకపోలేదు.

కొద్దిరోజులుగా అతను ఏదో లోలోన మధనపడిపోతున్నాడు. ఏదో ఒక విషయం అతని మనసును బాధపెడ్తోంది. గతంలో కొన్ని అనుభవాలు చూశాక ఈ నిర్ణయానికి వచ్చాడు. స్వయంగా అతనికి అనుభవం కలగటంతో అతనిలో ఏవో కొత్త ఆలోచనలు నిర్ణయాలు జరిగిపోతున్నాయి.

కొన్ని రోజుల క్రిందట అతను తన బంధువు అంతకంటే ఎక్కువైన మిత్రుడు ఆరిఫ్ భాయ్ ఇంటికి వెళ్ళాడు. ఒకే నగరంలో ఉంటున్నా పరస్పరం కలుసుకోవటం చాలా అరుదు.

అతను వెళ్ళిన సమయానికి ఆరిఫ్ భాయ్ లోపల ఎక్కడో ఉన్నాడు. కాలింగ్ బెల్ నొక్కితే ఎవరూ బయటికిరాలేదు.

లోపల్నుంచి ఆరిఫ్ భాయ్ గొంతు వినబడింది. 'బేటా.. బయట ఎవరో వచ్చినట్టున్నారు. జావిద్ వస్తానని ఫోన్ చేశాడు. వెళ్ళి చూడు. నేనిప్పుడే వస్తున్నాను' అంటూ.

ఇంతలో అతని కొడుకు మాజిద్ బయటికొచ్చాడు. అతనిని చూసి జావిద్ సంతోషంలో పలకరించబోతే ఆ కుర్రాడు మొహం చిట్లించుకుని లోనికి వెళ్ళిపోయాడు. కనీసం సలామ్ కూడా చెయ్యలేదు. అక్కడే ఉన్న ఓ కుర్చీలో కూర్చుండిపోయాడు. ఇంతలో బయట్నుంచి అతని కూతురు రేష్మా వచ్చింది. జావిద్‌ను చూసీ చూడనట్లు లోనికి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి కూడా అతనిని చూసి సలామ్ కూడా చెయ్యకుండా లోనికి వెళ్ళిపోయింది.

వాళ్లిద్దరికీ జావిద్ కొత్తవాడేం కాదు. చిన్నప్పట్నుంచి చూస్తూ పెరిగారు. వాళ్ళ ప్రవర్తన వింతగొల్పింది.

ఇంతలో ఆరిఫ్ వచ్చి కుశల ప్రశ్నలు వెయ్యసాగాడు. 'ఆరిఫ్ భాయ్.. నీ పిల్లలు నన్ను గుర్తుపట్టినట్లు లేరు' చెప్పాడు జావిద్. లోపల మండుతున్నా బయటికి నవ్వుతూ.

అతను ఓ క్షణం జావిద్ వంక చూసి, 'వాళ్ళు అంతే మారరు' అన్నాడు అర్థవంతంగా.

కొడుకు బీటెక్ చదివాడు. కూతురు ఏదో కోర్సు చేస్తుందట. వారికి మర్యాద మన్ననలను నేర్పించడమేమిటి?

ఇంటికి అయినవాళ్ళు వస్తే పలకరించకపోగా విసుక్కోవటం ఒకటా?

"వాళ్ళు అలా తయారవ్వడానికి తల్లిదండ్రులయిన మేమే కారణం. చదువులపేరిట వారిని అందరికీ దూరంగా ఉంచాము. చదువే లోకంగా అదే జీవిత లక్ష్యంగా పెంచాము. అందుకే వారికి బంధాలు బంధుత్వాలు అంటే తెలియవు. ఇంటికి ఎవరు వచ్చినా వాళ్ళు అలాగే ప్రవర్తిస్తారు. తమ స్మార్ట్‌ఫోన్‌లతో తమ తమ గదుల్లో దూరిపోతారు. వారిని విదేశాల్లో ఉంచి చదివించాము. ఇప్పుడు మళ్ళీ కొద్దిరోజుల్లో అక్కడికే వెళ్ళిపోతున్నారు' అన్నాడు ఆరిఫ్‌భాయ్.

చదువుతోపాటు మానవతా విలువలు నేర్పలేదా అని అడగాలనిపించింది జావిద్‌కు.

అక్కడ ఉండాలనిపించలేదు, తిరిగి వచ్చేశాడు. ఇలాంటి అనుభవాలే మరికొన్ని చవిచూశాడు.

మరికొంతమంది ఇళ్ళల్లో పిల్లలు మంచిగా మసలుకుంటున్నారు. ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్నా ముందుకొస్తున్నారు. కన్నవాళ్ళకు సేవలందిస్తూ తమ కెరీర్‌ను కూడా చక్కగా మలచుకున్నారు.

మరికొందరు తమ కెరీర్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తూ పుట్టిన ఊరును, తమ బంధుమిత్రులను, పూర్వీకుల మూలాలను సైతం మరిచిపోయి చివరికి తమ కన్నవాళ్ళను సైతం మరచిపోయి విదేశాలలో ఉంటున్నారు.

ఈ జీవితం శాశ్వతం కానీ, స్థిరం కానీ కాదు. పరిస్థితులు మారినా మానవ సంబంధాలు మారకూడదు. జీవితంలో మానవ సంబంధాలు ఎంతో ముఖ్యమైనవి. బంధాలు, బంధుత్వాలను మరచిపోకూడదు.

జావిద్ నమ్ముకున్న సిద్ధాంతం ఇదే.

ఒకరోజు వీలు చూసుకుని తన భార్యాపిల్లల్ని తీసుకుని కారులో అతని ఊరికి బయలుదేరాడు. సిటీకి అలవాటు పడిన అతని పిల్లలు ఆ ఊరికి వెళ్ళాలంటే ఇష్టపడరు. నగరంలో ఒక గేటెడ్ కమ్యూనిటీ లగ్జరీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఆ పిల్లలకు ఊరిలో ఉన్న తమ తాత గారి పాతబడిన ఇంట్లో ఉండాలంటే మహా చిరాకు పడిపోతుంటారు.

ఆ ఊరు నగరానికి సుమారు మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దారిలో కనిపించే నదులను, చెరువులను, తోటలను చూపిస్తూ ఫొటోలు తీసుకుంటూ ప్రయాణించ

సాగారు. దారిలో ఒక ఊరు దాటుతున్నప్పుడు ఆ ఊరిలో తన మేనత్త ఉన్న విషయం గుర్తుకొచ్చింది జావిద్‌కు.

ఆమె ఇంటిని వెతుక్కుంటూ వెళ్ళి కారు ఆపాడు ఆ ఇంటి ముందు. జావిద్ అత్తయ్య వారిని చూసి మహానందపడిపోతూ జావిద్‌ని, అతని భార్యాపిల్లలను గుండెలకు హత్తుకుని, "ఎన్నాళ్ళకు చూశాను మిమ్మల్నందరినీ" అంటూ ఏడ్చేసింది. ఎంత వద్దంటున్నా వినకుండా ఎంతో రుచికరమైన వంట చేసి భోజనం పెట్టింది.

వాళ్ళున్నంత సేపు ఆ కుటుంబం పట్ల ప్రేమను, ఆప్యాయతను అలా కురిపిస్తూనే ఉంది. అది చూసి పిల్లలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగరం నుంచి తెచ్చిన పండ్లు, మిఠాయిలను ఆమెకు అందించారు.

తరువాత అక్కడినుంచి బయలుదేరి తమ ఊరు చేరుకున్నారు.

ఆ ఇల్లు అతని తాతల కాలం నాటిది. మొదట ఆ ఇంట్లో తాతయ్య కుటుంబం అంటే అతని తండ్రి, బాబాయ్‌లు ఉండేవారు. వాళ్ళందరూ అక్కడే పుట్టి పెరిగారు.

తాతయ్య కుటుంబం వ్యవసాయంపై ఆధారపడి జీవించింది. పొలాలు, తోటలు ఉండేవి.

తండ్రి బాబాయ్‌లు కొంతవరకు చదువుకున్నారు. తరువాత తన తండ్రి తనకు ఉన్నత చదువులు చెప్పించడంతో మంచి ఉద్యోగం కూడా లభించడంతో తాను నగర బాటపట్టాడు. వివాహం కూడా అక్కడే జరిగింది. పిల్లలు కూడా కలిగారు.

★★★

ఆ రోజు రాత్రి పిల్లలు ఆ పాత ఇంట్లో పడుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డారు.

ఏసీ లేదని విసుక్కున్నారు. వైఫై లేదని గింజుకున్నారు. దోమలు కుడ్తున్నాయని వాపోయారు. కానీ జావిద్ మాత్రం తన పిల్లలు అన్నింటికీ అలవాటు పడాలని తన బాబాయ్ వాళ్ళ పిల్లలతో పాటు పడుకోమన్నాడు.

ఆ ఇంటి చుట్టూ గల మామిడిచెట్లు, నేరేడు చెట్లు, వేప చెట్లు.. రకరకాల పండ్ల చెట్లు చల్లటి గాలులను ఆస్వాదిస్తూ పిల్లలను కూడా ఆ స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించమన్నాడు.

★★★

మరుసటి రోజు ఉదయమే పిల్లల్ని లేపి, తను అనుకున్న విధంగా ప్రణాళికాబద్ధంగా తన కారులో బయటికి తీసుకువెళ్ళాడు.

ఓ రెండు కిలోమీటర్ల దూరం వరకు వెళ్ళి కారును ఆపి పిల్లల్ని దిగమన్నాడు. రోడ్డు పక్కన గల పొలాలను చూపిస్తూ ఇలా అన్నాడు...

'అదిగో అక్కడ కన్పిస్తున్న పొలాలను, భూములను చూశారా? అవి ఒకప్పుడు మావే. మా తాతయ్య భూమిని దున్ని పంటలు పండించేవాడు. మా తండ్రి అంటే మీ తాతయ్య, చిన్న తాతయ్యలు కూడా అదే పని చేసేవారు. కష్టపడి పనిచేసేవారు. చదువు పట్ల నేను ఆసక్తి చూపుతుంటే నన్ను నగరానికి పంపించి చదివించారు. ఈనాడు నేను ఇంతటి వాణ్ణి అయ్యాను. నగరంలో ప్రస్తుతం సుఖమైన జీవితాన్ని గడుపుతున్నామంటే మన పూర్వీకుల కష్ట ఫలితమే. అందుకే మనం ఎప్పటికీ వారిని మరచిపోకూడదు. మన మూలాలను విస్మరించకూడదు' అంటూ పిల్లలకు వివరించి చెప్పాడు.

తరువాత పదండి, మీకు ఇంకో చోటుకు తీసుకువెళ్తాను అంటూ కారులో మరో కొద్దిదూరంలో తన తండ్రి తాతల సమాధుల దగ్గరికి తీసుకువెళ్ళాడు.

"ఇదిగో, ఇది మా తాతయ్య గారి సమాధి. అది మా తండ్రి గారిది. అంటే మీ తాతది. అదిగో అక్కడ కన్పిస్తున్న సమాధులు అన్నీ మన పెద్దలవి" అంటూ ఒక్కొక్కరి జీవిత విశేషాలను చెప్పుకొచ్చాడు.


పిల్లలు విభ్రాంతితో చూస్తూ వింటుండిపోయారు. వారిలో ఏదో కదలిక కన్పించింది. ఏదో తెలియని భావావేశాలలో తండ్రిని చుట్టుకు పోయారు. ఆ తరువాత కూడా ఆ ఊరిలో ఉన్నన్నాళ్ళూ తన కుటుంబ మూలాల గురించి తన పిల్లలకు తెలియజేస్తూనే ఉన్నాడు.

అక్కడ ఉన్న తమ బంధువులను, మామయ్య, అత్తయ్యలందరితో కలిపాడు. పిల్లలు కూడా మునుపటిలా బెరుకుగా ఉండక వారితో కలిసిపోయారు. పైపెచ్చు తమ ఇంటికి రమ్మని ఆహ్వానించారు కూడా. అక్కడి సంస్కృతిని, మర్యాద మన్ననలను నేర్చుకున్నారు.

మనం ఎక్కడినుంచి వచ్చామో తెలుసుకున్నారు. కాదు... తెలుసుకునేలా చేశాడు తండ్రి జావిద్. ✤

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# నైతికత, విశ్వాసం.. ఉత్తమ జీవితానికి మార్గదర్శకాలు



**అర్షియా**

విశ్వాసం, నైతిక విలువలు మనిషి జీవనానికి దారి దీపం లాంటివి. అవి మనిషిలో మంచి గుణాలను, మానవత్వ విలువలను పెంపొందిస్తాయి. నైతిక విలువలు లేని విశ్వాసం అసంపూర్ణం.

అందుకే .. "విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కు భయపడండి. సత్యవంతులకు తోడ్పడండి" .. అని ఖురాన్ చెప్తుంది. అల్లాహ్ మీద విశ్వాసం, నైతిక విలువలు పాటించడం వల్ల మేలు కలుగుతుందన్న విశ్వాసం ముస్లింలు కలిగి ఉండాలి. లజ్జ, సిగ్గు విశ్వాసానికి కవలల వంటివి. అందులో ఒకటి వదిలేస్తే రెండో దానిని కూడా కోల్పోతారు. కేవలం నమాజ్, రోజా తదితర ఆరాధనలను నిష్ఠగా పాటించి నిత్య జీవితంలో నైతికతను పాటించకపోతే అలాంటి వారు స్వర్గ ప్రవేశానికి అర్హులు కారు. వారు నరకానికి వెళతారు. ఎవరైనా నమాజ్, ఉపవాసాలు, జకాత్‌ల ద్వారా పుణ్యాన్ని సంపాదించినా.. ఇతరులను పరుషంగా తిట్టి వారి మనస్సులను గాయపరిస్తే, తమ స్వార్థం కోసం ఇతరులపై దౌర్జన్యం చేస్తే వారి సమస్త పుణ్య ఫలాలు వారి వల్ల పీడనకు గురైన వారికి పంచబడతాయి. అలాంటి వ్యక్తి ప్రవక్త(స) దృష్టిలో నిజమైన ముఫ్లిస్(దరిద్రుడు). నమాజ్, ఉపవాసాల పట్ల శ్రద్ధాసక్తి చూపుతూ నైతికత కలిగి దానధర్మాలు చేస్తూ, ఇతరుల మనసు గాయపరచకుండా నడుచుకునేవారు స్వర్గానికి అర్హత పొందుతారు. ఇస్లామీయ జీవన విధానంలో, వ్యక్తిత్వ నిర్మాణంలో నైతిక విలువలకు ఇంత ప్రాధాన్యత ఉండటం వల్ల ఈ విషయాలను ప్రవక్త(స) నిరంతరం బోధనల ద్వారా తన సహచరుల హృదయాల్లో

నాటుకునేలా కృషి చేశారు. విశ్వాసం, సంక్షేమం, నైతికత విడి విడి అంశాలు కావని.. ఈ మూడింటి సమ్మిళిత రూపమే ఇస్లాం అని తెలిపారు. ఆ భావన తన సహచరుల హృదయాల్లో తాత్వికంగా, సైద్ధాంతికంగా, భావజాల పరంగా గట్టిగా నాటుకొనేలా చేశారు. "నోరు తెరిస్తే అబద్ధం చెప్పేవాడు, ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చని వాడు, తనకు అమానతుగా ఇచ్చిన దానిని కాజేసేవాడు, ఘర్షణ పడినప్పుడు తిట్టేవాడు కపట స్వభావి" అని ప్రవక్త(స) తెలిపారు.

## ప్రవక్త బోధనలు.. వ్యక్తిత్వ వికాస పాఠాలు

ప్రవక్త(స) నైతిక బోధనలు మానవాళికి ఉత్తమ నైతిక ప్రమాణాలను అందించాయి. వ్యక్తిత్వ వికాస పాఠాలుగా నిలిచాయి. ఇస్లాం అలాంటి మానవీయ విలువల ఆచరణను ప్రోత్సహిస్తుంది. ఆయన నైతిక సుగుణాలను వివరంగా పరిశీలించే ముందు వాటికి సంబంధించిన కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం. ఒకసారి కొందరు "అల్లాహ్ దృష్టిలో, ఆయన దాసులలో ఆయనకు అత్యంత ప్రియమైన దాసుడు ఎవరు?" అని ప్రవక్త(స)ను ప్రశ్నించారు. అందుకు ఆయన "అత్యధిక నైతిక విలువలు కలిగి ఉన్న వ్యక్తే అల్లాహ్ దృష్టిలో ఉత్తముడు" అని పేర్కొన్నారు (హిబ్బాన్). మరో ఉల్లేఖనంలో ప్రవక్త మాట్లాడుతూ... "నైతిక విలువల్లో ఉత్తముడైన ముస్లిం విశ్వాసం పరిపూర్ణమైనది" అని చెప్పారు. ఉత్తమ నైతికత కలిగిన వ్యక్తి తన వ్యక్తిత్వం ద్వారా నమాజ్, రోజా ఫలాలను పొందే స్థాయికి చేరుకుంటాడని మరొక సందర్భంలో తెలిపారు. ఆరాధనల్లో సంతులనం పాటించే ముస్లిమ్ తన ఉత్తమ నైతిక ప్రవర్తన ద్వారా ఉపవాసాలు పాటించే, రాత్రి తహజ్జుద్ నమాజ్‌లో అల్లాహ్ వాక్యాలను పఠించే వ్యక్తి స్థాయికి చేరుకుంటాడు అని ప్రవక్త మరొక సందర్భంలో చెప్పిన విషయాన్ని ఇబ్నె ఉమర్ ఉల్లేఖించారు.

ప్రవక్త(స) తన భార్యలను కాని, సేవకులను కాని ఎప్పుడూ చేతితో కొట్టలేదు. తనను హింసించిన, బాధ పెట్టిన వారిపైనా ఆయన దయ చూపేవారు. జీవితాంతం గొప్ప దాతగా ప్రసిద్ధి చెందారు. ఒకసారి ఒక యాచకుడు ప్రవక్త(స)ను సాయం అడిగాడు. ఆ సమయానికి ఆయన వద్ద ఏమీ లేకపోయినా.. అల్లాహ్ ఆదేశంతో తన పేరు చెప్పి సరుకులు కొనుగోలు చేయాలని.. తనకు ధనం సమకూరగానే ఆ సరకుల బాకీ చెల్లిస్తానని చెప్పారు. సత్యాన్ని ప్రకటించడంలో ప్రవక్త(స) ఎప్పుడూ వెనుకాడలేదు. న్యాయాన్ని నిరంతరం పరిరక్షించేవారు. ఆయన వదనం ఎల్లప్పుడూ చిరునవ్వు కలిగి ఉండేది. ఆయన ప్రవర్తనలో మంచితనం ఉట్టిపడేది. నిరాశ, నిస్పృహలను ఎన్నడూ దరికి చేరనిచ్చేవారు కాదు. అతిథులను తగిన రీతిలో గౌరవించేవారు. ఎవరు ఆతిథ్యమిచ్చినా స్వీకరించేవారు. ప్రాపంచిక విలాసాలకు, వ్యర్థ విషయాలకు దూరంగా ఉండేవారు. ఇస్లామీయ మహా బోధకులు, మహోపాధ్యాయులు, చివరి దైవ ప్రవక్త(స) నైతిక ప్రవర్తనలన్నీ ఒకచోట చేర్చి ప్రచురిస్తే అది ఒక మహా గ్రంథమే అవుతుంది. ✤


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com



నసీరా బేగం

# తల్లిదండ్రులే స్వర్గానికి సోపానాలు

**వృద్ధులు** సమాజ శ్రేయస్సుకు పునాదులు లాంటి వారు. తమ కష్టాన్నంతా ధారపోసి వారి సంతానానికి ఉన్నత విద్యను ఇచ్చే పూర్తి ప్రయత్నం చేసి ఉంటారు. సన్మార్గ మార్గంలో వారిని నడిపించటానికి తాము నేర్చుకున్నది ముందు తరానికి అందించటానికి పూర్తి కృషి చేసి ఉంటారు.

ప్రతి ఒక్కరు కళ్ళతో చూసే నిజం ఏమిటంటే, తల్లిదండ్రులు పిల్లలకు జన్మనివ్వటానికి, వారిని పెంచి పోషించటానికి, వారికి విద్యాబుద్ధులు నేర్పించటానికి, వారిని వారి కాళ్ళపై నిలబెట్టడానికి,వారిని ఉన్నత స్థితిలో చూడటానికి రాత్రీ పగలు కష్టపడుతూ ఉంటారు. వారి పిల్లలు భూమిపై పుట్టిన మరుక్షణం నుంచి ప్రతి క్షణం కాలంతోపాటు పోటీ పడుతూ జీవిస్తూ ఉంటారు. బిడ్డ పుట్టగానే తమ సౌఖ్యాన్ని, తమ సంతోషాలను, వారి కోసం పూర్తిగా త్యాగం చేసి జీవిస్తూ ఉంటారు. ఈ జీవన ప్రయాణంలో తమను తాము మరిచిపోతారు. వారు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోరు, తమపైనా ఖర్చు చేసుకోరు. తమ పిల్లల అవసరాలను, వారి కోరికలను కష్టపడి సంపాదించి ఖర్చు చేస్తారు. చేస్తూ చేస్తూ చివరకు వారు తమ కోసం ఒక చిల్లిగవ్వ కూడా మిగుల్చుకోకుండా ఉండిపోతారు. ఇటు శరీర కండలన్నీ కరిగిపోయి అటు సంపద కొండలన్నీ తరిగిపోయి చివరకు ఎముకలతో కూడుకున్న శరీరం తప్ప వారి వద్ద ఇంకేమీ ఉండదు.

జీవితాంతం తమ సంతానం కోసం ఇంతగా కష్టపడ్డాము కదా! ఇక మిగతా జీవితం తమ సంతానం తమకు అంతకంటే అధికంగా ప్రేమతో, గౌరవంతో తమను చూసుకుంటారని, సేవ చేస్తారని ఆశను కలిగి ఉంటారు. వారు తమ కష్టఫలితంగా మేడలు, మిద్దెలు కావాలని కోరరు. వెండి బంగారాలతో, వజ్ర వైఢూర్యాలతో కూడుకున్న నగలు కావాలని అడగరు. కేవలం వారికి ఒక ఆశ్రయం, ఒక భరోసా, సంతాన సామీప్యం కావాలని కోరుకుంటారు. తమ సంతాన పిల్లల అల్లరిచేష్టలను, బుడిబుడి నడకలను, వచ్చీరాని నత్తి మాటలను, కేరింతలను, నాయనమ్మ తాతయ్య అని పిలుస్తూ పరుగెత్తుకుంటూ వచ్చి వారిని చుట్టుముట్టి కౌగలింపులను ఆస్వాదించాలని కోరుకుంటారు అంతే.

కాని మన అభివృద్ధి చెందుతున్న ఈ నవయుగంలో వారి ఆశలు అడియాశలే అయిపోతున్నాయి. వారి కష్ట ఫలితంగా ఉన్నతంగా ఎదిగి విశాలమైన బంగ్లాలు కట్టుకున్నప్పటికీ నాలుగడుగుల ఒక చిన్న గది కూడా వారి కోసం కరువైపోతోంది. ఆ అందమైన బంగ్లాలకు ఈ ఎముకలతో కూడుకున్న శరీరం అందహీనంగా చేసేస్తుందేమోననే భయం వారికి పట్టుకుంటోంది. అభివృద్ధి సోపానాలను అధిగమించి గమ్యాన్ని చేరుకునే ప్రయాణంలో అడ్డుగా ఉంటారేమోనని జంకు. క్షణం తీరికలేని ఈ జీవన సాగరంలో వారితో కొన్ని నిమిషాలు గడపటం కూడా నష్టదాయకమే

అని భావిస్తోంది ఈ తరం. భార్యాపిల్లలతో సంతోషంగా, సంబరంగా గడుపుతూ ఆనందదాయకమైన జీవితం గడపటంలో ఒక పెద్ద అడ్డుగా భావిస్తోంది. చివరకు వృద్ధాశ్రమాలే మీకు మంచి స్థలమని, సరదాగా తోటి స్నేహితులతో చక్కగా గడపగలరని, అక్కడే శ్రద్ధగా, చక్కగా చూసుకుంటారని, అక్కడ ఉంటే మీ ఆరోగ్యం కూడా బాగుంటుందని, మేము వస్తూ పోతూ ఉంటామని కుంటిసాకులు చెప్పి తీసుకుని వెళ్ళి వృద్ధాశ్రమాలలో వారిని చేర్చుతున్నారు.

మరికొంతమంది సంతానం వారిని వృద్ధాశ్రమాల్లో చేర్చరు. కాని తమ ఇంటి ఒక మూలన ఉన్న గదిలో పడవేస్తారు. ఏదో కొద్దిగా తిండి పెడుతూ, కోప్పడుతూ, చీదరించుకుంటూ ఉంటారు. మరికొంతమంది అయితే ఇంటినుంచి బయటికి గెంటివేస్తున్నారు. వారి దగ్గర ఉన్నదంతా దోచుకుంటున్నారు. ఒట్టి చేతులతో బయటకు వెళ్ళి ఎండకు, వానకు, ఆకలికి ఎలా ఉంటుందో అని కూడా కనీస దయ కూడా వారి పట్ల ఉండటంలేదు. మరికొన్ని చోట్ల ఎక్కువ మంది సంతానం కలిగి ఉండటమే ఒక శాపంగా మారుతోంది. ఎందుకంటే నువ్వంటే, నువ్వు అని వృద్ధ తల్లిదండ్రుల బాధ్యత తీసుకోవటానికి ఎవ్వరూ ముందుకు రారు. చివరకు ఎవరో ఒకరు మంచివాడైతే ఆ కొడుకు వారి బాధ్యతను తీసుకుంటాడు. లేకపోతే అందరూ రోజులు పంచుకుంటారు. అలా రోజులు పంచుకుంటే పర్వాలేదు. కాని వారి వాటాకు వచ్చిన రోజులు గడచిపోయిన తర్వాత ఒక్కక్షణం కూడా తమ వద్ద ఉంచుకోవటానికి వారు ఇష్టపడరు. వారు ఎలాంటి ఆరోగ్య పరిస్థితిలో ఉన్నా, మంచానికి పరిమితమై ఉన్నా సరే అక్కడ నుంచి వెళ్ళిపోవలసిందే. ఆ వయోవృద్ధుల కోసం ఇది ఎంత దారుణమైన పరిస్థితో ఆలోచించండి.

ఈ దుష్టులు, దుర్మార్గులు అయిన సంతానానికి వారి గతం ఒక్క క్షణమైనా గుర్తుకు రాదా? అతని పుట్టుక ఎలా అయిందో, అతని తల్లి అతన్ని ఎంత కష్టంగా నవమాసాలు మోసిందో, ఎంతటి బాధను భరించి కన్నదో, ఎన్ని నిద్రాహారాలు మాని అతన్ని కంటికి రెప్పలా సాకిందో, ఎలా పెంచి పెద్ద చేసిందో అతని తండ్రి ఇంటి బయటకు అతని కోసం సంపాదించటానికి ఎన్ని కష్టాలు పడ్డాడో, రాత్రనక పగలనక కష్టపడి అతని అవసరాలు తీర్చాడో ఆ సంపాదన కోసం ఎంత మంది ముందు తలవంచాడో, ఎన్ని మాటలు పడ్డాడో, ఎన్నిసార్లు చెయ్యి చాచి అప్పులు అడిగాడో, ఎన్నిసార్లు పచ్చడి మెతుకులు తిన్నాడో, ఎన్ని సార్లు చిరిగిపోయిన బట్టలను కుట్టి వేసుకున్నాడో, ఇంకా పైసా పైసా కూడబెట్టి చదివించాడో ఎప్పుడైనా ఆలోచించావా? నీ దేహదారుఢ్యం బలంగానూ, అందంగానూ ఇట్టే తయారైందా? నీ తల్లిదండ్రుల శరీరం ఎముకల గూళ్ళు ఇట్టే అయిపోయిందా? ఓరీ మూర్ఖుడా! నీ తల్లిదండ్రులు నీ కోసం కొవ్వొత్తి మాదిరిగా కరిగిపోయి నీకు కాంతిని ప్రసాదించారు. నిన్ను దృఢంగా, అందంగా తీర్చిదిద్దారు. చదివించి గొప్పవానిగా చేశారు. నీకు వివాహం చేసి నీ భార్యాపిల్లలతో సుఖంగా, సంతోషంగా గడిపే ఏర్పాట్లు చేశాడు. చివరకు వారి వద్ద ఒక్క ప్రాణం తప్ప ఏమీ మిగలలేదు. కాని ఇప్పుడు వారి ప్రాణమే నీకు భారమైపోయింది. కాస్త ఆలోచించు! నీ అంతరాత్మను లేపు! నీవు చేస్తున్న ఈ దుష్టకార్యాన్ని ఎవరైనా మన్నిస్తారా? దేవుడు నిన్ను శిక్షించడా? మన్నిస్తాడా? సమాజం మన్నిస్తుందా?? నిన్ను ఎవరూ మన్నించరు. చివరకు నీ అంతరాత్మ కూడా నిన్ను వదిలిపెట్టదు. దాని పర్యవసానం అనుభవించటం తప్ప నీకు మరే గత్యంతరం ఉండదు.

సమాజంలో మంచివాళ్ళు కూడా ఉన్నారు. చాలామంది సంతానం తమ తల్లిదండ్రులను వృద్ధ స్థితిలో ఉన్నప్పుడు ఇంకా గౌరవంగా, ప్రేమగా చూసుకుంటున్నారు. వారికి తమ ఇల్లు, భవంతి కాకపోయినా ఉన్నదాంట్లోనే సకల వసతులు కల్పించి చక్కగా ఉంచుతున్నారు. వారి కోసం తమ అధిక శాతం సంపదను ఖర్చు పెడుతున్నారు. వారితో మంచి సమయాన్ని గడుపుతున్నారు. వారితో నవ్వుతూ, నవ్విస్తూ హాయిగా ఉంచే ఏర్పాట్లు చేస్తున్నారు. వారి ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటున్నారు. వారి హక్కులను నెరవేర్చటానికి పూర్తి కృషి చేస్తున్నారు.

అల్లాహ్ ఇలాంటి సంతాన కష్టాన్ని వృధా పోనివ్వడు. వారికి ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. ప్రపంచంలో సుఖం, శాంతి, అభివృద్ధి లాంటి ప్రయోజనాలను కలిగిస్తాడు. పరలోకంలో స్వర్గపు భవనాలను ప్రసాదిస్తాడు. ఈ క్రింది గాథ ద్వారా ఈ విషయం చక్కగా అర్థమవుతుంది.

ఒకసారి హ'జ్రత్ మూసా(అ) అల్లాహ్‌తో 'ఓ అల్లాహ్! స్వర్గంలో నాతో పాటు ఎవరు ఉంటారు' అని అడిగారు. దానికి సమాధానంగా అల్లాహ్ 'ఫలానా కసాయి నీతోపాటు స్వర్గంలో ఉంటాడు' అని తెలియజేశాడు. అప్పుడు ఆయన ఆ కసాయిని గమనించ టానికి అక్కడకు వెళ్ళారు. అక్కడ అతను ఒక పొట్టేలును కోసి మాంసం మొత్తాన్ని అమ్ముకున్నాడు. ఆ ఇంటి ప్రవేశ గదిలోనే ఎముకల గూడుతో బలహీనంగా, నీరసంగా పడి ఉన్న తల్లి ఉంది. ఆ తల్లిని లేపి ముఖం కడిగి కూర్చో బెట్టాడు. తీసుకొచ్చిన లేత మాంసాన్ని మెత్తగా వండి ఎంతో ప్రేమతో, ఓపికతో, చిన్న పాపకు తినిపించిన మాదిరిగా ఆమెకు తినిపించాడు. నీళ్ళు త్రాపించాడు. ముఖాన్ని తుడిచి మెల్లగా పడుకోబెట్టాడు. అప్పుడు ఆ ఎముకల గూడుగా ఉన్న తల్లి రెండు చేతులెత్తి 'ఓ అల్లాహ్! నా కొడుకును నీవు నీ ప్రవక్త మూసా(అ)తోపాటు స్వర్గంలో స్థానాన్ని కల్పించు' అని ప్రార్థించింది. ఆ తల్లి దుఆను అల్లాహ్ ఆమోదించాడు. అతను అల్లాహ్‌కు వద్దకు చేరకముందే మూసా(అ)తోపాటు అతనికి స్వర్గంలో స్థానాన్ని కల్పించాడు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

## ప్రవేశిక

**పేరు :** 10వ ఆయత్‌లోని పదం 'దుఖాన్' ని ఈ సూరా పేరుగా నిర్ణయించడం జరిగింది. అంటే 'దుఖాన్' అనే పదం వచ్చిన సూరా అని భావం.

**అవతరణ కాలం:** దీని అవతరణ కాలం కూడా విశ్వసనీయమయిన ఏ ఉల్లేఖనం ద్వారానూ నిర్ధారితంగా తెలియదు. కాని విషయాల అంతస్సాక్షం వల్ల తెలిసేదానిబట్టి 'జుఖ్‌రుఫ్', దాని ముందు కొన్ని సూరాలు అవతరించిన కాలంలోనే ఇదీ అవతరించి ఉంటుంది. అయితే ఇది వాటిలో కొంత వరకు చివరిదయి ఉంటుంది. చారిత్రకపూర్వ రంగం ఏమిటంటే మక్కా తిరస్కారుల వ్యతిరేక వైఖరి మరీ, మరీ తీవ్రతరమవుతూ ఉన్నప్పుడు ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ఇలా ప్రార్థించారు, "దేవా, యూసుఫ్(అ) కాలం నాటి కరవు వంటి కరవుతో నాకు సహాయం చెయ్యి." ప్రవక్త(శ్రీ (స) తలంచిందేమిటంటే, ఆ జనులపైన విపత్తు విరుచుకుపడితే వారికి దేవుడు గుర్తుకు వస్తాడు, వారి హృదయాలు సద్బోధ స్వీకరించడానికి మృదువయి పోతాయి అని. అల్లాహ్ ఆయన ప్రార్థనను స్వీకరించాడు. మొత్తం ప్రాంతంలో అతి బలమయిన కరవు దాపురించింది, జనం తల్లడిల్లిపోయారు. చివరికి కొందరు ఖురైష్ నాయకులు, వారిలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ ప్రత్యేకంగా అబూ సుఫ్యాన్‌ని పేర్కొన్నారు, ప్రవక్త(శ్రీ (స) వద్దకు వచ్చారు, ఆయన్ని వేడుకున్నారు, జాతిని ఈ విపత్తు నుంచి విముక్తి కలిగించడానికి అల్లాహ్‌ను ప్రార్థించమన్నారు. ఈ సందర్భంలోనే అల్లాహ్ ఈ సూరా అవతరింపజేశాడు.

**ప్రధాన విషయం, చర్చనీయాంశాలు:** ఈ సందర్భంలో మక్కా తిరస్కారులకు అవగతపరచడానికి, వారిని హెచ్చరించడానికి ప్రవక్త మహనీయుల (స)కు అవతరించిన ప్రసంగం కొన్ని ముఖ్యమయిన చర్చలతో ప్రారంభమవుతుంది :

మొదటి విషయం, మీరు ఈ ఖుర్‌ఆన్‌ని ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) రచనగా భావించి తప్పు చేస్తున్నారు. ఈ గ్రంథం దానంతట అదే నిండుగా ప్రత్యక్ష సాక్ష్యమయి ఉంది, ఇది ఏ మానవుని గ్రంథం కాదు, నిఖిల జగతికి ప్రభువయిన వాని గ్రంథం.

రెండవ విషయం, మీరు ఈ గ్రంథం విలువను గ్రహించడంలోనూ పొరపడుతున్నారు. మీ దృష్టిలో ఇదొక విపత్తుగా మీపైన అవతరించింది. వాస్తవానికి పరమ ప్రభువు తన కారుణ్యం చేత మీ వద్దకు తన సందేశహరుని పంపాలని, తన గ్రంథాన్ని అవతరింపజేయాలని నిర్ణయించిన ఆ ఘడియ అత్యంత శుభప్రదమయిన ఘడియ.

మూడవ విషయం, మీరు మీ అవివేకం వల్ల, ఈ సందేశహరునితో, ఈ గ్రంథంతో పోరాడి గెలుపొందగలమని అపోహకు గురయి ఉన్నారు. వాస్తవానికి ఈ సందేశహరుని ఆవిర్భావం, ఈ గ్రంథం అవతరణ ఓ ప్రత్యేకమయిన ఘడియలో జరిగాయి. అందులోనే అల్లాహ్ భాగ్యాల నిర్ణయాలు చేస్తాడు. అల్లాహ్ చేసే నిర్ణయాలు తేలికయినవి కావు. వాటిని ఎవరు బడితే వారు మార్చివేయలేరు. అవి మూఢత్వం, మూర్ఖత్వం, అవివేకం ఆధారంగానూ జరగవు, వాటిలో లోపం, దోషం ఉండే ఆస్కారముంటుందనడానికి. ఇవి విశ్వ మహాపరిపాలకుని పరిపక్వమయిన, నిర్ద్వంద్వమయిన నిర్ణయాలు. ఆయన సర్వం వినగలిగేవాడు, సమస్తం ఎరిగినవాడు, విజ్ఞతా సంభరితుడయినవాడు. అటువంటి నిర్ణయాలతో పోరాడటం ఆషామాషీ కాదు.

నాల్గవ విషయం, భూమీ ఆకాశాలకు, సమస్త విశ్వంలోని ప్రతి వస్తువుకూ స్వామి, ప్రభువు, పోషకుడు అల్లాహ్ అని స్వయంగా మీరున్నూ అంగీకరిస్తారు. జీవన్మరణాలు ఆయన అధీనంలోనే ఉన్నాయని సయితం ఒప్పుకుంటారు. అయినప్పటికీ మీరు ఇతరుల్ని ఆరాధ్యులుగా చెయ్యడానికి పట్టుపడుతున్నారు. దానికి మీ వద్ద ఉన్న తార్కాణం ఒక్కటే, మీ తాత ముత్తాతల కాలం నుండి ఇది ఇలాగే జరుగుతూ వస్తోందన్నది. నిజానికి ఏ వ్యక్తి అయినా సచేతనంగా, అల్లాహ్ మాత్రమే స్వామి, ప్రభువు, జీవన్మరణాల అధికారి అని నమ్మేమాటయితే ఆరాధ్యుడయ్యే అర్హత ఆయనకు తప్ప, లేదా ఆయనతో పాటు ఇతరులకూ ఉండగలదని అతనికి ఎన్నటికీ కించిత్తయినా ఆశంక కూడా కలగదు. మీ తాత ముత్తాతలు ఒకవేళ తెలివి తక్కువతనం కనబరిస్తే మీరున్నూ కళ్ళు మూసుకుని దాన్నే అనుసరిస్తూ పోయేందుకు ఏ కారణమూ లేదు. వాస్తవానికి వారి ప్రభువు కూడా ఆ ఒకే ఒక్క దేవుడు, ఆయనే మీకూ ప్రభువు. వారున్నూ ఆయన ఒక్కడినే ఆరాధించాలి, మీరున్నూ ఆయన్నే ఆరాధించాలి.

**(మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా(ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం
(కితాబుల్ మగాజీ)

## వహ్షీ వృత్తాంతం

681) జాఫర్ బిన్ అమ్ర్ బిన్ ఉమయ్యా జమ్రీ (రజి) తెలిపారు: నేను ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్(రజి)తో కలసి హమస్‌కు బయలుదేరాను. మేమిద్దరం హమస్‌కు చేరుకోగానే ఉబైదుల్లాహ్(రజి) నాతో, వహ్షీ '(ఉహుద్ యుద్ధంలో మహనీయ హమ్జా-రజి-ను వధించిన హబ్షీ) ఎవరో మీకు తెలుసా? పదండి, హమ్జా వీర మరణం గురించి అతన్ని అడిగి తెలుసుకుందాం' అన్నారు. దానికి నేను, 'అలాగా! అయితే పదండి, తప్పకుండా ఈ విషయం తెలుసు కోవాలి' అన్నాను.

ఆ విధంగా మేము వహ్షీ గురించి జనుల ముందు ఆరా తీశాము. 'అడుగో, అక్కడ తన నివాస గృహం నీడలో కూర్చొని ఉన్న ఆయనే వహ్షీ' అని మాకు తెలియజేయటం జరిగింది. అతను దుంగ మాదిరిగా ఉబ్బి ఉన్నాడు. మేము అతని దగ్గరకు వెళ్ళి, కాస్సేపు నిలబడ్డాము. తరువాత సలామ్ చేశాము. అతను మా సలామ్‌కు బదులిచ్చాడు. ఉబైదుల్లాహ్(రజి) తన తలపాగాను శరీరానికి చుట్టుకుని కేవలం కళ్ళు మాత్రమే వహ్షీకి కనిపించేలా బందోబస్తు చేసుకున్నారు.

'వహ్షీ! నీవు నన్ను గుర్తుపట్టావా?'- అడిగారు ఉబైదుల్లాహ్.

వహ్షీ ఆయన్ని ఎగాదిగా చూసి, 'లేదు, దైవసాక్షిగా! కాకపోతే నాకొక విషయం తెలుసు- అదీ బిన్ ఖియార్ ఒక స్త్రీని వివాహమాడారు. ఆమె ఉమ్మె ఖితాల్‌గా పిలువబడేది. మక్కాలో ఆమెకు ఒక పిల్లవాడు పుట్టాడు. నేనామె కోసం తిండి గింజలు సమకూర్చడానికి బయలుదేరాను. ఆ పిదప నేనా పిల్లవాణ్ణి అతని పెంపుడు తల్లి (పాలిచ్చే ఆయా) వద్దకు ఎత్తుకుని వెళ్ళాను. ఆ సమయంలో అతని కన్నతల్లి కూడా వెంట ఉన్నది. బహుశా ఆ సమయంలో నేను నీ పాదాలు చూసి ఉన్నాను' అన్నాడు వహ్షీ.

అంతే, ఉబైదుల్లాహ్ బిన్ అదీ తన ముఖంపైనున్న ముసుగును తొలగించి, 'నీవు మాకు హమ్జా(రజి) అమరగతి నొందిన వృత్తాంతాన్ని వివరించగలవా?' అని ఉత్సుకతతో అడిగారు. దానికి అతను, 'ఓ! తప్పకుండా వివరించగలను. ఇంతకీ జరిగిందేమిటంటే బద్ర్‌యుద్ధం జరిగినప్పుడు మహనీయ హమ్జా(రజి) తుఅయ్‌మా బిన్ అదీ బిన్ ఖియార్‌ను వధించారు. అందువల్ల నా యజమాని అయిన జుబైర్ బిన్ ముత్‌యిమ్ నాతో, 'ఒకవేళ నీవు గనక హమ్జా(రజి)ను, నా పినతండ్రి తుఅయ్‌మా హత్యకు ప్రతీకారంగా చంపగలిగితే, నీవు బానిసత్వం నుండి స్వేచ్ఛ పొందగలవు' అన్నారు.

తరువాత ఖురైషులు 'అయ్‌నైన్' యుద్ధం కొరకు బయలుదేరారు. 'అయ్‌నైన్' అనేది ఉహుద్ పర్వతశ్రేణుల్లోని ఒక కొండ. దానికీ- ఉహుద్‌కి మధ్యన ఒక లోయ ఉంది. నేను కూడా యుద్ధ సంకల్పంతో వారి వెంట వెళ్ళాను. (ఇరు వర్గాల సేనలు పరస్పరం) మార్కొనడానికి సిద్ధమైనప్పుడు (ఖురైషుల వర్గం నుండి) సబా బిన్ అబ్దుల్ ఉజ్జా ముందుకు వచ్చి, 'నాతో తలపడే వాడెవడైనా ఉన్నాడా?' అని సవాలు విసిరాడు. (ఈ సవాలుకు జవాబుగా) హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి) ముందుకు వచ్చి, 'ఓ సబా! ఓ ఉమ్మె అన్మార్ పుత్రుడా! నీ తల్లి స్త్రీలకు సున్నతీ (ఖితాన్) చేసేది.[1] ఇప్పుడు నువ్వేమో దైవంతో, దైవప్రవక్తతో పోరాడేటంతటి వాడివయ్యావా?' అని గర్జించారు. ఆ తర్వాత ఆయన అతనిపై దాడి చేసి అతని కథను సమాప్తం చేశారు. ఈ సంఘటన గతంగతః అయింది.

వహ్షీ ఇలా అన్నాడు : నేను ఇటువైపు ఒక చట్టుబండ చాటున హమ్జా(రజి) కోసం మాటేసి కూర్చున్నాను. ఆయన నన్ను సమీపించగానే, నేనాయనపై ఒక ఈటెను గురిచూసి విసిరాను. అది ఆయన నాభి క్రింది నుండి దూసుకుని పోయింది. అదే ఆయన అమరగతికి కారణమయింది. పిదప ఖురైషులు మరలిరాగా, నేను కూడా వారితోపాటే వచ్చే శాను. మక్కాలోనే స్థిరపడ్డాను. కాని మక్కా నగరం కూడా ఇస్లామీయ సామ్రాజ్య పరిధిలోనికి రాగానే నేను తాయిఫ్ పట్టణానికి వెళ్ళిపోయాను. తాయిఫ్ ప్రజలు దైవప్రవక్త(స) దగ్గరకు ఒక రాయబారిని పంపినప్పుడు, అక్కడి ప్రజలు నాకు ఒక సలహా ఇచ్చారు: దైవప్రవక్తలు (అలైహిముస్సలామ్) ఎవరిపైనా దౌర్జన్యం చేయరు (అందుకే నీవు ముస్లింగా ధర్మపరివర్తన చెందు. ఇస్లామ్ ధర్మస్వీకారం తరువాత గత కాలంలో నీ వల్ల జరిగిన పాపాలన్నీ క్షమించ బడతాయి) అని సూచించారు. అందువల్ల నేనూ వారితోపాటు బయలుదేరాను. నేను దైవ ప్రవక్త(స) సన్నిధికి చేరుకోగానే, ఆయన(స) నన్ను చూసి, "వహ్షీవి నువ్వేనా?" అని అడిగారు. నేను 'అవున'న్నాను. "హమ్జా(రజి)ను వధించినది నువ్వేనా?" అని ఆయన ప్రశ్నించగా, 'ఈ వ్యవహారంలో దైవప్రవక్త(స)కు తెలిసినదంతా సత్యం' అన్నాను. దానికి ఆయన(స), "నీవు ఎన్నడూ నీ ముఖాన్ని నాకు చూపించకుండా ఉండగలవా?" అని అడిగారు. అంతే, ఆ క్షణమే నేను అక్కడి నుండి నిష్క్రమించాను.[2]

మహాప్రవక్త(స) పరమపదించిన తరువాత ముసైలిమా కిజ్జాబ్(అబద్ధీకుడు) తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు. నేను ఆలోచించసాగాను. నేనిప్పుడు ముసైలిమా కిజ్జాబ్‌కు వ్యతిరేకంగా జరిగే యుద్ధంలో తప్పనిసరిగా పాల్గొనాలి. నేను గనక ఆ అబద్ధీకుణ్ణి చంపగలిగితే అది హమ్జా(రజి) వధకు ఎంతో కొంతయినా ప్రాయశ్చిత్తం అవుతుంది. అంతే, నేను ముస్లిములతో కలసి ఆ మార్గభ్రష్టుడికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో పాల్గొన్నాను.[3] అతనితో జరిగిన యుద్ధ విశేషాలు జగద్విదితమే.

వహ్షీ ఇలా అన్నాడు : (రణరంగంలో) ఒక వ్యక్తి (ముసైలిమా) ఒక గోడకు ఆనుకుని నిలబడి ఉండటం నేను గమనించాను. గోధుమ రంగు ఒంటెలా చిందర వందరైన జుట్టుతో బెదిరిపోయి ఉన్నాడు. నేను అతని మీద కూడా ఒక పదునైన చిన్న ఈటెను విసిరాను. అది అతని గుండెలో నుంచి దూసుకుని భుజాన్ని చీల్చుకుంటూ వెళ్ళిపోయింది. అంతలో ఒక అన్సార్ సహాబీ (రజి) అతనిపై లంఘించి, ఖడ్గంతో అతని పుర్రెపై ఒక్క వ్రేటు వేశారు... అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇలా అన్నారు : (ముసైలిమా వధించబడిన తరువాత) ఒక అమ్మాయి ఇంటి కప్పుపై నిలబడి ప్రకటించింది– "అమీరుల్ మోమినీన్‌ని ఒక నల్లని బానిస (అంటే వహ్షీ– రజి) వధించాడ"ని.

---

681-1. పూర్వం అరబ్బులలో పురుషుల మాదిరిగానే స్త్రీలకు కూడా సున్నతీ (సుంతీ, ఖితాన్) చేసేవారు. పురుషులకు పురుషులు సున్నతీ చేస్తే స్త్రీలకు స్త్రీలు సున్నతీ చేసేవారు. ఈ ఆచారం అజ్ఞాన కాలం నుండే చెలామణిలో ఉండేది. ఇస్లామ్ దీనిని త్రోసిపుచ్చలేదు. ఎందుకంటే దైవప్రవక్త ఇబ్రాహీమ్(అ) కాలంనాటి కొన్ని ఆచార సంప్రదాయాలు అరబ్బులలో మిగిలి ఉండేవి. వాటిలో ఈ 'ఖత్నా' కూడా ఒకటి. సబా బిన్ అబ్దుల్ ఉజ్జా తల్లి స్త్రీలకు ఖత్నా చేసేది. అందుకే మహనీయ హమ్జా(రజి) అతని తల్లి చేపట్టిన వృత్తిని ఇక్కడ జ్ఞాపకం చేశారు.

681-2. బానిసత్వం నుండి స్వేచ్ఛను పొందే తపనలో వహ్షీ హజ్రత్ హమ్జా(రజి)ను యుద్ధరంగంలో హతమార్చాడు. కాని మక్కా విజయం తర్వాత అతని దారులన్నీ మూసుకుపోయాయి. గత్యం తరం లేని పరిస్థితిలో అతను ఇస్లామ్ స్వీకరించి దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యాడు. మక్కా విజయం సందర్భంగా అంతిమ ప్రవక్త(స) చేసిన మన్నింపుల ప్రకటన జగద్విదితమే. "ఈ రోజు మీపై ఎలాంటి నిందారోపణ లేదు. మీరు స్వతంత్రులు" అంటూ హజ్రత్ యూసుఫ్(అ) తన అన్నలకు పెట్టిన క్షమాభిక్ష తరహాలో క్షమించారు. దాంతో మక్కాలోని అవిశ్వాసుల రాతిగుండెలు కరిగి నాయి. వారు హృదయపూర్వకంగా ఇస్లాంలో చేరారు.

వహ్షీని చూడగానే దైవప్రవక్త(స)కు తన పినతండ్రి హమ్జా(రజి) జ్ఞాపకం వచ్చారు. అందుకే, ఇక మీదట నీవు నా ముందుకు రాబాకు అని వహ్షీని కోరారు. వహ్షీ కూడా ప్రవక్త(స) ఆదేశాన్ని మనస్ఫూర్తిగా శిరసావహించారు.

681-3. మహాప్రవక్త(స) పరమపదించిన తర్వాత అరేబియాలో 'ఇర్తెదాద్' (ధర్మభ్రష్టత) ప్రబలింది. కొంతమంది ధర్మభ్రష్టులు (ముర్తద్‌లు) అయిపోయారు. ఈ ఉపద్రవానికి నాయకుడు ముసైలిమా కిజ్జాబ్. ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూబక్ర్ (రజి) ఇలాంటి తిరుగుబాటుదారులపై యుద్ధ ప్రకటన చేశారు. అప్పుడు వహ్షీకి తన తప్పును సరిదిద్దుకునే అవకాశం లభించింది. ధర్మ భ్రష్టుడైన ముసైలిమా కిజ్జాబ్‌ను చంపి తనకు అంటిన కళంకాన్ని చెరిపివేసుకునే అవకాశం లభించింది. ఆ పనిని అతను పూర్తి చేశాడు.

‘చరితార్థులు’-2



# డాక్టర్ సయ్యద్ ఇక్రాం రసూల్

## (1863-1943)

59



**ఆంగ్లేయాధికారుల** క్రూరత్వం ఫలితంగా అంధత్వం ప్రాప్తించగల తీవ్ర గాయాన్ని కూడా లెక్కపెట్టక మాతృభూమి విముక్తి పోరాటంలో ఏ మాత్రం వెనుకకు తగ్గక చివరి కంటా ముమ్మందుకు సాగిన డాక్టర్ సయ్యద్ ఇక్రాం రసూల్ 1863 జూన్ 17న ఒరిస్సా రాష్ట్రం కటక్ జిల్లా కేసార్‌పూర్‌లో జన్మించారు. స్వస్థలంలో ప్రాథమిక విద్య పూర్తిచేసి, వైద్యశాస్త్రం అభ్యసించిన సయ్యద్ ఇక్రాం రసూల్ కాస్తా డాక్టర్ ఇక్రాం రసూల్ అయ్యారు. చిన్నతనం నుండి స్వతంత్ర భావాలను సంతరించుకున్న ఆయన, సేవా భావంతో ప్రజలకు సేవలందించారు. మహాత్మాగాంధీ మార్గంలో జాతీయోద్యమంలో ప్రవేశించిన డాక్టర్ రసూల్ అఖిల భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి 1920 నాటి నాగపూర్ సమావేశాలలో పాల్గొనడం ద్వారా పూర్తిస్థాయి జాతీయోద్యమకారుడిగా రూపొందారు. మహాత్మా గాంధీ ఆదేశాలను పాటిస్తూ లాఠీ దెబ్బలు రుచి చూడడానికి, జైలుకెళ్ళడానికి కూడా సిద్ధపడ్డ ఆయన ఒరిస్సా రాష్ట్రంలో సహాయనిరాకరణ-ఖిలాఫత్ ఉద్యమాలు పెల్లుబుకడానికి పండిత గోపాబంధు దాస్ మార్గదర్శకత్వంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఒరిస్సా రాష్ట్రంలో ఏర్పడిన ‘ఉత్కల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ’ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ రసూల్ బాధ్యతలను నిర్వహించారు. సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా విదేశీ వస్తువుల, వస్త్రాల బహిష్కరణోద్యమంలో పాల్గొన్న ఆయన ఆనాటి నుండి ఖద్దరు ప్రచారం ప్రారంభించి చివరి వరకు ఖద్దరును ధరించారు. ఖిలాఫత్ ఉద్యమంలో భాగంగా బాబు ధర్మానంద పట్నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర ముస్లింల సమావేశంలో ఖిలాఫత్ కమిటీ ఏర్పరిచి ఒరిస్సాలో ఖిలాఫత్ ఉద్యమానికి చుక్కానిగా నిలిచారు. సహాయనిరాకరణ-ఖిలాఫత్ ఉద్యమాల సందర్భంగా ఆయనను అరెస్టు చేసి హజారిపూర్ జైలులో ఉంచారు. ఆ జైలులో పోలీసులు ఆయన పట్ల క్రూరంగా వ్యవహరించటం వలన కన్ను దెబ్బతిని అంధత్వానికి దగ్గరయ్యారు. అప్పటి నుండి పలుమార్లు భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు సాగిన ప్రతి పోరాటంలో చురుగ్గా పాల్గొన్న ఆయన ఆంగ్ల పోలీసుల దాష్టికానికి గురవుతూ వచ్చారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో క్రియాశీల పాత్ర నిర్వహించిన డాక్టర్ రసూల్ మాతృభూమికి ఆంగ్లేయ పాలన నుండి విముక్తి కలిగించాలంటే హిందూ-ముస్లింలు కలసికట్టుగా కృషి సల్పాలని భావించారు. 1940లో ముస్లింలీగ్ చేసిన భారత విభజన తీర్మానం పట్ల నిరసన వ్యక్తం చేసిన ఆయన హిందూ-ముస్లింల ఐక్యతకు కట్టుబడి మహాత్ముని బాటలో గ్రామీణాభివృద్ధి, అంటరానితనం నిర్మూలన, వయోజన విద్య, గ్రంథాలయాల స్థాపన, అభివృద్ధి తదితర కార్యకలాపాలకు చేయూత ఇచ్చారు. ఒక వైపున భారత జాతీయ కాంగ్రెస్ ఆదేశాలను పాటిస్తూ జాతీయోద్యమకారుడిగా స్వేచ్ఛా - స్వాతంత్ర్యాల సాధనకు, మరొక వైపున వైద్యునిగా ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తూ చివరి శ్వాస వరకు గడిపిన డాక్టర్ సయ్యద్ ఇక్రాం రసూల్ 1943 ఏప్రిల్ మూడున కన్నుమూశారు. ✤




**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# అశ్లీలతకు వ్యతిరేకంగా ఓ గొప్ప ఉద్యమం అవసరం

మూలం :
ముహియ్యుద్దీన్ గాజీ

అనువాదం :
ఆలియా బిన్తె మునీర్ షర్ఫియ

**గత సంచిక తరువాయి...**

## హజ్రత్ యూసుఫ్ (అ) నమూన

సౌశీల్యతను పరిరక్షించుకోవడంలో ఒక అద్భుతమైన అనుసరణీయమైన నమూన హజ్రత్ యూసుఫ్ (అ) వారిది. యుక్త వయస్సులో యువకులు మనోవాంఛల వైపునకు అడుగులేస్తారు. చెడులకు పాల్పడే ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటారు. హజ్రత్ యూసుఫ్ (అ) అటువంటి ఘోర పాపపు గోడలను బద్దలు గొట్టి బయటికి పరుగులు తీశారు. ఎంత క్లిష్టమైన పరిస్థితి! ఏ ఇంట్లో ఆయన పెరిగారో ఆ ఇంటి మహిళ ఆయన్ను లొంగదీసుకునేందుకు విఫలయత్నం చేసింది. ఖుర్ఆన్ పదాలు పరిశీలించండి:

అతను ఉంటున్న ఇంటిలోని స్త్రీ అతని కోసం వల పన్నసాగింది. ఒక రోజున తలుపులు మూసి "వచ్చెయ్యి!" అని అన్నది.(12:23)

కానీ ఇటువంటి పరిస్థితులలో యూసుఫ్ (అ) వారి హుందాతనం చూడండి,

యూసుఫ్(అ) ఇలా అన్నాడు: "నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను. నా ప్రభువు నాకు మంచి స్థానం ప్రసాదించాడు (నేను ఈ పని ఎలా చెయ్యను?) అటువంటి దుర్మార్గులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు." (12: 23)

ఒకవైపు ఈజిప్టు మహిళ అతని వైపుకు కొనసాగుతుంది.

ఆమె అతని వైపునకు రాసాగింది. (12: 23)

మరోవైపు ఆయన అల్లాహ్ స్మరణను తన పవిత్ర కవచంలా మార్చుకుంటారు.

యూసుఫ్ కూడా ఆమె వైపునకు పోయి ఉండేవాడే, ఒకవేళ తన ప్రభువు నిదర్శనాన్ని చూసి ఉండకపోతే.(12:23)

తదుపరి రెండు పదాలలో రెండు వ్యతిరేక స్థితులను ఒకచోట చేర్చారు,

తుదకు యూసుఫ్, ఆమె ఒకరి వెనుక ఒకరు తలుపు వైపునకు పరిగెత్తారు. (12:25)

ఇద్దరు వ్యక్తులు వేగంగా తలుపు వైపునకు పరిగెత్తారు. ఒక స్త్రీ మనోవాంఛలకు దాసురాలై పరిగెత్తింది. పురుషుడు తన పవిత్రతను కాపాడుకోవడానికి తలుపు వైపునకు వేగంగా పరిగెత్తాడు. ఒకరి పరుగు పాపకార్యం కోసం, మరొకరి పరుగు పాపం నుండి రక్షించుకోవడం కోసం.

ఈ దృశ్యం చూడదగినది : ఈజిప్టు దేశానికి సంబంధించిన అందగత్తెలందరూ ఒకచోట చేరి హజ్రత్ యూసుఫ్ (అ)ను

వశపరచుకోవడానికి పన్నాగం పన్నారు. చివరకు తమ వైఫల్యాన్ని ఒప్పుకొని ఆయన గొప్పతనాన్ని అంగీకరించారు. హజ్రత్ యూసుఫ్(అ) అత్యంత పవిత్రతను గురించి వారు ఇలా అన్నారు : సిగ్గుబిడియాలతో కూడిన అత్యంత పవిత్రతను కలిగిన వ్యక్తి, మనిషి కాదు, ఒక గౌరవనీయమైన దైవదూతే.

అప్రయత్నంగా ఇలా అన్నారు: "హాషాలిల్లాహ్! ఇతను మానవుడు కాదు. ఇతను ఎవరో గొప్ప దైవదూతయే."(12: 31)

ఈజిప్టు యజమాని భార్య అప్రయత్నంగా ఇలా పలికింది:

నిస్సందేహంగా నేను అతనిని మోహించడానికి ప్రయత్నించాను. కానీ అతను తప్పించుకున్నాడు. (12:32)

ఒకవైపు ఈజిప్టు యజమాని భార్య అతనితో పాపకార్యం చేయించడానికి ఎంత మంకుపట్టులో ఉందంటే,

ఇతడు గనక నా మాట వినకపోతే చెరసాల పాలవుతాడు. తీవ్ర అవమానానికి గురి అవుతాడు.(12:32)

మరోవైపు హజ్రత్ యూసుఫ్ (అ) పాపకార్యం నుండి తనను రక్షించమని దైవాన్ని వేడుకున్నారు.

యూసుఫ్ (అ) ఇలా అన్నారు : "నా ప్రభూ! చెరసాల నాకు ఇష్టమే, వారు కోరే పనిని చెయ్యటం కంటే. నీవు గనక వారి జిత్తుల నుండి నన్ను తప్పించకపోతే నేను వారి వలలో చిక్కుకుపోతాను. అజ్ఞానులలో కలిసిపోతాను."(12:33)

## చెరసాల జీవితం ఎవరికి ఇష్టం?

ఇది ఎంత విచిత్రమైన విషయం! చాలామంది వ్యభిచారానికి పాల్పడి జైలుకు వెళతారు. కాని హజ్రత్ యూసుఫ్ (అ) ఆ చెడు నుండి కాపాడుకోవాలనే ప్రయత్నంలో జైలుకు వెళ్లారు.

## హజ్రత్ మర్యం (అ) అత్యంత పవిత్రమైన నమూన

సౌశీల్యత, పవిత్రత విషయంలో పురుషుల కొరకు హజ్రత్ యూసుఫ్ (అ) అద్భుతమైన నమూన అయితే, స్త్రీలకు హజ్రత్ మర్యం (అ) అత్యద్భుతమైన నమూన. విశ్వాసురాలైన స్త్రీ హజ్రత్ మర్యం అలైహస్సలాం తన పవిత్రతను రక్షించుకున్న విధానం ఒక పాఠ్య గ్రంథం. అల్లాహ్ దీనికి బదులుగా ఆమెకు ఎంతో ఉన్నతమైన స్థానాన్ని ప్రసాదించాడు. ఈ సుగుణాన్ని ఖుర్ఆన్‌లో ప్రస్తావిస్తూ ప్రళయం వరకు ఉన్నతమైన నమూనగా చేసివేశాడు.

## రెండు సంఘటనలు

ఒక సంఘటనలో ఈజిప్ట్ యజమాని భార్య ఇంటి తలుపులు మూసివేసి యూసుఫ్ (అ) వైపునకు అడుగులు వేస్తుంది. అప్పుడు యూసుఫ్ (అ) అల్లాహ్ శరణు అంటూ అల్లాహ్ శరణులో తనను తాను సంరక్షించుకుంటారు. (12:23)

రెండవ సంఘటనలో ఒక దైవదూత మనిషి రూపంలో హజ్రత్ మర్యం అలైహస్సలాం వారి వద్దకు ఆమె ఒంటరిగా ఉన్నప్పుడు చేరుకుంటాడు. ఆ దైవదూత అల్లాహ్ ఆజ్ఞతో ఆమె వద్దకు శుభవార్త తీసుకుని వచ్చాడు. కానీ ఇది హజ్రత్ మర్యం అలైహస్సలాం కొరకు పరీక్ష కూడాను. అప్పుడు ఆమె ఇలా అన్నారు :

"నీవు దైవభీతి కల మనిషివే అయితే నేను నీ బారి నుండి రక్షించవలసినదిగా దయామయుడు అయిన దేవుని శరణు కోరుకుంటున్నాను." (19:18)

హజ్రత్ యూసుఫ్ (అ), హజ్రత్ మర్యం అలైహస్సలాం ఇద్దరి సంఘటనలలో సారూప్యత ఏమిటంటే ఇద్దరూ పవిత్రత కోల్పోవడాన్ని అత్యంత ఘోరమైన పాపంగా పరిగణించారు. దాని నుంచి కాపాడుకునే చింతన చేశారు. దాని నుంచి తమను కాపాడుకోవడానికి అల్లాహ్ శరణు కోరుకున్నారు.

## లైంగిక స్వేచ్ఛ, లైంగిక ధోరణులలో పెద్ద వ్యత్యాసం ఉంది

అల్లాహ్ స్త్రీ పురుషులను సృష్టించాడు. స్వేచ్ఛ ప్రసాదించాడు. ఏమిటంటే ప్రకృతి సృష్టించిన వ్యవస్థలో జీవనం కొనసాగిస్తూ మనిషి తన ఇష్టంతో తన జంటను ఎన్నుకుంటాడు. పరస్పరం నికాహ్ అవుతుంది. దాంతో ఇరువురి మధ్య భార్యాభర్తల సంబంధం ఏర్పడుతుంది.

మనిషికి తన లైంగిక కోరికలు తీర్చుకునే స్వేచ్ఛ ఉంది. వ్యభిచారం స్త్రీ పురుషుల పరస్పర అంగీకారంతో జరిగినా అది అసభ్యకరమైన అపరాధం కోవలోనికే వస్తుంది.

తమ మర్మాంగాలను కాపాడుకునేవారు- తమ భార్యలూ, చట్టరీత్యా తన ఆధీనంలో ఉండే స్త్రీలూ తప్ప, వీరి విషయంలో కాపాడుకోకుండా ఉండేవారు నిందార్హులు కారు, అయితే ఇదిగాక ఇంకా ఎక్కువ కావాలని కోరేవారు హద్దులను అతిక్రమించేవారు. (70: 29-31)

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
గీటురాయి
వారపత్రిక

మనిషికి మంచి, చెడు అలవాట్లలో ఏదైనా ఒకదాన్ని ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. ఈ స్వేచ్ఛ స్వతహాగా ఎటువంటి ప్రత్యేకతను కలిగి లేదు. ఇది కేవలం అల్లాహ్ తరఫున ప్రతి మనిషికి ఇవ్వబడిన ఒక అవకాశం మాత్రమే. స్వేచ్ఛను సరైన విధంగా వినియోగించాలి. ఎవరైనా స్వేచ్ఛను దుర్వినియోగ పరిస్తే అతని గురించి చెడుగా చెప్పుకుంటారు. ఎవరైనా స్వేచ్ఛను సరిగ్గా వినియోగించుకుంటే వారు కొనియాడబడతారు. ఎవరైతే ఈ అవకాశాన్ని దుర్వినియోగ పరచుకుంటారో, చెడులకు పాల్పడతారో వారు విఫలమవుతారు.

పశువుల కంటే కూడా మనిషి శక్తిని, అధికారాలను కలిగి ఉంటాడు. అందుకే అతనికి నైతిక విలువల అవసరం ఉంటుంది. మనిషి శక్తి పరంగా ఎప్పుడైతే వృద్ధి చెందుతాడో నైతిక విలువల ఆవశ్యకత కూడా పెరిగిపోతుంది. నైతిక విలువలు శక్తిని నియంత్రణలో ఉంచుతాయి. ప్రస్తుత కాలంలో ఆధునిక మార్పులు మనిషిని శక్తివంతునిగా మార్చివేశాయి. అందుకే ఈ ప్రపంచ పరిరక్షణకై మనిషి నైతిక విలువలను కలిగి ఉండడం మునుపటి కంటే కూడాను అత్యంత ఆవశ్యకమైపోయింది.

ఆధునిక యుగపు మనిషి నైతిక విలువలను కోల్పోతే ఈ ప్రపంచం కొరకు అత్యంత వినాశకారిగా మారిపోతాడు. ఆందోళన చెందే విషయం ఏమిటంటే మనిషి ఎంత ఎక్కువగా శక్తివంతునిగా మారుతున్నాడో, అంతే ఎక్కువగా నైతిక విలువలను కూడా కోల్పోతున్నాడు.

## ఇస్లాం నైతిక విలువలను సంరక్షిస్తుంది

ఆధునిక యుగంలో సెక్యులరిజం మతం గురించి ప్రత్యేక సిద్ధాంతాన్ని రూపొందించింది. ఈ సిద్ధాంతం అత్యంత పరిమితమైంది. పూజా పురస్కారాలు, పండుగలు, పెళ్లితంతుల కల్చర్ వరకు మతం పరిమితం. నైతిక విలువలను మత పరిధుల నుంచి పూర్తిగా బయటకు తెచ్చి దానిని మనిషి స్వేచ్ఛ, ఇష్టం, అవసరం, ప్రయోజనంతో ముడిపెట్టింది.

స్కూల్ పుస్తకాలలో మతం గురించి పరిమితంగా బోధిస్తారు. ఉదాహరణకు ఇస్లాం ఒక సంపూర్ణ జీవన విధానం అని తెలుపరు. అలాగే ఇస్లాంలో సిగ్గుబిడియాలకు అధిక ప్రాధాన్యత ఉందని, అది అశ్లీల కార్యాలను అధర్మంగా ప్రకటించిందని బోధించరు.

దీనివల్ల వ్యభిచారపు నీచమైన రూపాలు, అశ్లీలపు అసభ్యకరమైన ప్రదర్శనలు చెడుగా భావించబడడంలేదు.

వాస్తవం ఏమిటంటే నైతికతను పెంపొందించడం, అనైతికత ప్రవాహాన్ని అడ్డుకోవడంలో మతం పోషించే పాత్ర అత్యంత అనివార్యం.

ఇస్లాం ధర్మ నైతిక విలువల భావనలు సుస్పష్టమైనవి. నైతిక విలువల పరిపూర్తికై అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (స) ప్రభవింప జేశాడు. ఆయన ద్వారా నైతిక విలువలను బోధించాడు. సిగ్గు బిడియాలను విశ్వాసంలో భాగంగా సూచించాడు. వ్యభిచారాన్ని అసభ్యకరమైన చేష్టగా పరిగణించాడు. ఎవరైనా వ్యభిచారానికి పాల్పడితే అతను విశ్వాసి కాడు అని స్పష్టం చేశాడు. ఇస్లాంలో వస్త్రధారణ, పరదా వ్యవహారంలో స్పష్టమైన బోధనలు ఉన్నాయి.

## సంస్కరణ ఉద్యమం అనివార్యం

ప్రవక్త హజ్రత్ లూత్ (అ) సిగ్గుమాలిన, హద్దులు దాటేసిన జాతి వైపునకు పంపబడ్డారు. హజ్రత్ లూత్ (అ) ఏళ్ల తరబడి వారి సంస్కరణకై కృషి చేశారు. ఖుర్ఆన్ పలుచోట్ల హజ్రత్ లూత్ (అ) వారి ఈ ప్రత్యేక సందేశ, సంస్కరణ మిషన్ గురించిన ప్రస్తావన చేసింది. బోధపడిందేమిటంటే ప్రవక్తల మిషన్ కేవలం ఆరాధనల వరకే పరిమితం కాదు. మంచిని పెంపొందించడం, చెడును రూపుమాపడం కూడా ప్రవక్తల మిషన్‌లో ఒక పెద్ద భాగమే.

మద్యన్ జాతి కూడా నైతిక విలువల పతనంలో చిక్కుకుపోయింది. వారి రుగ్మత ఆర్థిక వ్యవహారాలకు సంబంధించింది. కొలతలలో హెచ్చుతగ్గులు వారి చెడు రుగ్మతగా మారిపోయింది. ఆద్, సమూద్ పేరు గల అత్యంత శక్తితో కూడిన జాతులు, ఫిర్ఔన్, అతని సైన్యం భూమిలో ఉపద్రవం సృష్టించారు. అల్లాహ్ ఈ జాతులన్నింటినీ సంస్కరించడం కొరకు ప్రవక్తలను ప్రభవింప జేశాడు. ప్రవక్తలు విశ్వాసం, నైతిక విలువలు రెండింటి సంస్కరణ కొరకు శతవిధాల యత్నించారు. చివరి క్షణం వరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ప్రస్తుత కాలంలో అశ్లీలం, అసభ్యత మానవ సమాజాన్ని తీవ్ర నైతిక వినాశనంలో పడవేసే దిశగా ముందుకు కొనసాగుతుంది. నైతిక విలువలకు తీవ్ర ప్రమాదం పొంచి ఉంది. సిగ్గు బిడియాల గోడలు కూలిపోతున్నాయి.

ఒకవేళ నైతిక విలువల పతనం ఒక శక్తివంతమైన ఉద్యమంగా మారిపోతే దానిని ఎదుర్కొనేందుకు శక్తివంతమైన ఉద్యమాల అవసరం ఉంది. ఈ ధ్యేయం కోసం, ప్రవక్తల బాటను పట్టాలి. అనైతికత, అశ్లీలతకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. ఈ బాధ్యత అందరికంటే ప్రథమంగా ముస్లిం సముదాయంపై ఉంటుంది.




# స్వేచ్ఛ

తహ్సీన్ హుమైర్వీ...??

వినోదాల విశృంఖలత్వం
విచక్షణ ఎరుగని విచేష్టలు
మద్యం మత్తులో
వికృతి రూపం దాల్చిన
విద్రోహ చర్యలు
నిశీథి శిథిలాల్లో ఊడబీకిన
వనిత విలువలు
నిప్పుల గదిలోకి
నెట్టబడుతున్న మానవీయం
ఇదేనా స్వేచ్ఛా?

పెచ్చరిల్లిన అజ్ఞానాంధకారాలు
మూఢనమ్మకాల దుర్ఘటనలు
మౌఢ్యంలోకి నెట్టే
కుళ్ళుభావాల కుడ్యాలు
అంతరంగాల్లో
నిబిడీకృతమైన స్వార్థాలు
విలువలు దిగజార్చే
మాధ్యమాల నీలి నీడలు
చీకటి హస్తాల చెరలో
కర్కశంగా కాటువేసే
కాలనాగుల విషవలయాలు
ఇదేనా స్వేచ్ఛా?

వ్యసనాల కౌగిట్లో
విచ్ఛిన్నమౌతున్న బతుకులు
దేహాన్ని, దేశాన్ని ద్వేషంతో
నింపే రాజకీయ పగ్గాలు
సమైక్యతను చీల్చే
అగ్ర, ఉగ్ర అక్రమాలు
సంకుచిత మనస్తత్వం
అనాలోచిత ఆవేశాలు
అబద్ధాల జోరు
నిర్ధారణకు రాకుండానే
కూలిపోతున్న యదార్థాలు
ఇదేనా స్వేచ్ఛా?

కాదుకాదు, అది స్వేచ్ఛ కాదు
సమాజ శ్రేయస్సుకు
విఘాతం కలిగించేది
పరులకు, పౌరులకు
హాని కలిగించేది
పరిధులు దాటి ప్రవర్తించేది
స్వేచ్ఛ ఎలా అవుతుంది?
అదో అందమైన పదం
ఉన్నతమైన భావం
నైతిక పరమార్థం
అనైతికతకు ఆమడ దూరం
సహనం, సోదర భావం
కలగలసిన మనిషితనం.
ఒక్క సృష్టికర్త దాస్యంలో
సమస్త మిథ్యాదేవుళ్ళ దాసోహం
నుంచి విముక్తి పొందడమే.

# జ్ఞాన జ్యోతిని వెలిగించాలి...
# ...అజ్ఞాన పొరల్ని తొలగించాలి!

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి...**

### జ్ఞానానికి మరో విభజన

**జ్ఞానం, విజ్ఞానం, సుజ్ఞానం, ప్రజ్ఞానం**

**జ్ఞానం :** జ్ఞానం అనగా తత్ విషయ పరిజ్ఞానం. మనం ఒక వస్తువును చూస్తాము. అది ఫలానా అని తెలుస్తుంది.

**విజ్ఞానం :** మనకు తెలిసిన వస్తువు మంచి, చెడు తెలుసు కుంటాము. దాన్ని గూర్చి కొంత పరిశీలన జరుగుతుంది.

**సుజ్ఞానం :** మనకు తెలిసిన జ్ఞానం మంచి, చెడు తెలుసుకుని తదుపరి అందులో సరైన దానిని గూర్చి పరిశీలించి, దాని సంపూర్ణ అవగాహన, అనుభవాన్ని పొందడమే వివేచన.

**ప్రజ్ఞానం :** మనం పొందిన అనుభవ ఫలితంగా దాన్ని సుస్థిరం చేసుకుని, అదే మనముగా మార్పు చెందడం ప్రజ్ఞ లేక ప్రజ్ఞానము.

**ఉదా:** జ్ఞానం భౌతికం. ఒక పుష్పాన్ని, ఫలాన్ని తీసుకున్నప్పుడు, అది పుష్పమని, ఫలమని తెలుస్తుంది. విజ్ఞానములో ఆ పుష్పము, ఫలము జాతి, రంగు, వాసన గ్రహిస్తాము. సుజ్ఞానములో దాన్ని మనం ఎలా ఉపయోగించాలి, ధరించటానికా, తినడానికా, అమ్మడానికా లేక దానధర్మానికా అని తెలుస్తుంది. ధరించటానికే, తినడానికే, అమ్మడానికే అయితే అది లౌకికం. అలా కాక దానిని దానధర్మానికి ఉపయోగిస్తే ఆధ్యాత్మికం.

### విజ్ఞానం తెచ్చిన విప్లవం

విజ్ఞానం- మనిషి మాటలేమయినా చెప్పవచ్చు. కాని నిత్య జీవితంలో అందరూ ఆచరణలో వీలయినంత వరకు విజ్ఞానాన్ని పాటిస్తూనే ఉంటారు. 'అన్నమూ- సున్నమూ అంతా ఒకటే నాయనా' అనే వేదాంతి కూడా "అన్నమయితేనేమిరా! సున్న మయితేనేమిరా!! అయినా ఈ పాడు పొట్టకు అన్నమే వేతామురా" అంటారుగాని ఒక 'బుట్టెడు సున్నము వేతాములే ఈ సారికి' అనుకోడు.

"మంత్రము పఠించి లిప్తపాటులో హిమాలయాలు చేరెను." అని నమ్మమనే మిత్రుడు నిజ జీవితంలో రైలు ఎక్కో, బస్సు ఎక్కో, ఇంకా జేబులు బరువుగా వుంటే విమానం ఎక్కో హిమాలయాలు చేర్తాడు గాని మంత్రం పాడి బయలుదేరడు." బస్సులు, రైళ్ళు, విమానాలు శాస్త్ర జ్ఞానంతో మనిషి సాధించుకొన్నవే.

రోగం వచ్చి గందరగోళం పడే వ్యక్తి ముడుపులు గట్టినా, తాయెత్తులు, ఇనుప రేకులు, రంగురంగుల దారాలు కట్టుకున్నా, రంగురాళ్లు ధరించినా, అంతటితో ఆగడు. వెంటనే డాక్టర్ దగ్గరకెళ్ళి వైద్యం చేయించుకొంటాడు. "వైద్యం" శాస్త్ర జ్ఞానంలో భాగమే.

"ఆఖరికి మాటలకే, మంత్రాలకే చింతకాయలు రాల్తాయని మనమెంత నచ్చచెప్పినా, నమ్మ పలికినా- చెప్పే మనమెంత గొప్ప పేరున్న వ్యక్తులమయినా, వినే ఏ మనిషీ చింతచెట్టు క్రింద కూర్చుని మాటల్తో మాయ చేయాలని చూడడు. రాయి తీసుకొని చెట్టుకేసి కొడ్తాడు. ఇదీ విజ్ఞానమంటే, కాబట్టి- జ్ఞానం అనే ఆయుధంతో నీలో చెలరేగే సందేహాలను, సంశయాలను, శంకలను సంహరించు. అలా నిరుత్సాహంగా కూలబడకు. లే!! జ్ఞాన జ్యోతిని పట్టు, అజ్ఞాన అంధకారాల్ని తరిమికొట్టు.

### మనో నిగ్రహానికి మించిన మహాకార్యం మరొకటి లేదు

మనం ఇంద్రధనుస్సు రంగుల అందాలను కనుల పండుగగా చూసి ఆనందించగలుగుతున్నాం. కోకిలమ్మ పంచమ స్వర గీతికల మాధుర్యాలను వీనులవిందుగా విని తన్మయత్వం

పొందగలుగుతున్నాం. షడ్రసోపేతమైన ఆహారాలను నోరారా భుజించి సంతృప్తిని పొందగలుగుతున్నాం. కుసుమ కోమలమైన పూబోడి స్పర్శాసుఖాలలో, ఆనంద సముద్రంలో ఓలలాడగలుగుతున్నాం. మనకు ప్రపంచాన్ని చూపించేవి కన్నులు, శబ్దాలను వినిపించేవి చెవులు, వాసనలను చూపించేది ముక్కు, రుచులను చూపించేది నాలుక, స్పర్శను తెలిపేది చర్మం. ఈ ఐదూ 'జ్ఞానేంద్రియాలు'. వీటిని పంచేంద్రియాలు అని కూడా అంటారు.

మేమతనికి రెండు కళ్ళు, ఒక నోరు, రెండు పెదవులు ఇవ్వలేదా? (మంచికి, చెడుకు సంబంధించిన) రెండు స్పష్టమైన మార్గాలు అతనికి చూపలేదా? (బలద్: 8-10)

అయితే కొందరు కన్నులు ఉండి కూడా చూడలేరు. చెవులు ఉండి కూడా వినలేరు. ముక్కు ఉండి కూడా వాసన చూడలేరు. జిహ్వ ఉండి కూడా రుచి తెలుసుకోలేరు. చర్మం ఉండీ స్పర్శ జ్ఞానం పొందలేరు. దీనికి కారణం ఏమిటో తెలుసా? ఈ జ్ఞాన పంచమికి అధిపతి మెదడు. మెదడులో ఈ ఐదు ఇంద్రియాలకూ ప్రత్యేకంగా ఐదు కేంద్రాలు ఉన్నాయి. పంచేంద్రియాల నుంచి వాటి కేంద్రాలకు వార్తలు మోసుకురావటానికీ, కేంద్రాల నుంచి ఆజ్ఞలు తీసుకురావటానికీ తంతి తీగల వంటి నాడులు ఉన్నాయి. కాబట్టి ఈ బాహ్యమైన ఇంద్రియాలలోగానీ, కేంద్రాల నుంచి ఆజ్ఞలు తీసుకురావడానికీ తంతి తీగలవంటి నాడులు ఉన్నాయి. ఈ బాహ్యమైన ఇంద్రియాలలోగానీ, నాడులలోగానీ, మెదడు కేంద్రాలలోగానీ దోషాలుంటే, ఇంద్రియాలు ఉన్నా కూడా ఇంద్రియజ్ఞానం ఉండదు. పంచేంద్రియాలు శరీరంలో ఇతర మామూలు అవయవాల వంటివి కావు. ఇవి ప్రత్యేకమైన అవయవాలు. ఇవి మెదడులో భాగాలనే చెప్పాలి. ఈ ఇంద్రియాలలో ఏ మాత్రం ఒడిదుడుకులు వచ్చినా ఈ జ్ఞానేంద్రియం దెబ్బ తింటుంది. కొన్ని వ్యాధులలో జ్ఞానేంద్రియాలలోనో, వాటి జ్ఞాన నాడులలోనో, మెదడులోని జ్ఞాన కేంద్రంలోనో మార్పులు రావచ్చు. ఈ మార్పుల వల్ల ఆ ఇంద్రియ జ్ఞానంలో కూడా మార్పులు వస్తాయి. ఉదాహరణకు కంటిలోగాని, కంటి నాడిలో గాని, కంటి కేంద్రంలోగానీ మార్పులు వస్తే చూపులో మార్పులు వస్తాయి.

కనుల పండుగగా ఉండే దృశ్యాలు, వీనులవిందుగా వుండే శ్రావ్యాలూ, జిహ్వకు రుచిగా ఉండే భక్ష్యాలూ, ముక్కుకు ఇంపైన వాసనలూ, మేనుకు సుఖకరమైన స్పర్శల ఆనందాలు అనుభవిం చాలనే మానవుడు ఉవ్విళ్లూరుతుంటాడు. కానీ మన పూర్వీకులు, మహాజ్ఞానులూ ఇంద్రియాలను అరికట్టడానికి ప్రయత్నించేవారు. ఇంద్రియ నిగ్రహం వల్ల మనిషి ఉన్నత స్థాయిని చేరుకోగలడు. ఇంద్రియాలను నిగ్రహించి, అరిష్వర్గాలను జయించి, సుభక్తాగ్రేసరులు ముక్తిమార్గాన్ని అన్వేషిస్తున్నారు. ఈ ప్రయత్నాన్ని ఆధునికులు కొందరు హేళన చేస్తారు. అనుభవించగల శక్తి ఉండి అనుభవించకపోవడమేమిటి? అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట శని ఉండటమేమిటని ఈ మేథావుల వాదం. ఏది ఎలా ఉన్నప్పటికీ పంచేంద్రియాలు మానవుడి విజ్ఞానాన్నీ, వివేకాన్నీ పెంపొందించి వికాసాన్ని కలిగించే మాట మాత్రం నిజం. కావున పంచేంద్రియాలకు సుఖం ఉంటే ఆరోగ్య పరంగా సంపూర్ణ మానవుడుగా పరిగణించవచ్చు.

## గౌరవ దృష్టి నేటి అవసరం

మనిషి తనకు ఉన్న విద్యావిజ్ఞానాలను కొంత ప్రదర్శించి కొందరు ప్రశంసించగానే ఉబ్బితబ్బిబ్బయినా ఫరవాలేదు. కాని 'నన్ను దెబ్బ తీయడం ఎవడబ్బ తరం' అని పొగరుమోతుగా తల ఎగురవేస్తేనే చిక్కు. ఆ స్వయోత్కర్ష స్థితిలో మనిషి ఎదుటివాణ్ణి ఖాతరు చెయ్యడు. తన మొదటివాణ్ణి లెక్కజెయ్యడు. తన నుదుటి వ్రాతనూ గుర్తుచేసుకోడు. తానే సర్వం, తానే ఆది, తానే అంతం అనుకుంటాడు. అహంకారం మండే వస్త్రం, అది ధరించినవాణ్ణి కాపాడదు. తానూ మండుతుంది, ధరించినవాణ్ణి దహించి వేస్తుంది. అది మనిషికీ, సత్యానికీ మధ్య అడ్డు తెరగా నిలుస్తుంది, అహంకార జ్వాలలలో రగులుతూ మనిషి తానెన్నో అందాలతో అలరారుతున్నట్లు భ్రమపడినా దానివల్ల అంతరంగం మసిబారి, బాహ్యం వికృతంగా తయారయి అందరికీ దూరమయి, ఎవరికీ చేరువ కాకుండా పోతాడు మనిషి.

విజ్ఞానం వికసిస్తూ ఉంది నలువైపులా కానీ,

వివేకం కుంచించుకుపోతూ ఉంది ప్రతి రోజు ఇలా...



అల్లాహ్ ఈ సృష్టి నిర్మాత. ఆయన ఒక్కడే ఈ ప్రపంచానికి ప్రభువు. ఆయన సృష్టించిన ఈ మనుషుల్లో కులతత్వపు అడ్డుగోడలెందుకు? ప్రతి మనిషికి సమానమైన హక్కులు అల్లాహ్ కల్పించాడు. ప్రతి ఒక్కరు తమ కర్తవ్యాన్ని పవిత్రంగా, నిష్కల్మష హృదయంతో, నిస్వార్థ భక్తితో నిర్వర్తించాలి. మనస్సు, ఆత్మ నిర్మలంగా ఉన్నప్పుడూ, తఖ్వాతో మన మనస్సు నిండినప్పుడు మన ఇంటి తొట్టిలోని నీళ్ళు కూడా జంజం జలంతో సమానం. తఖ్వాయే లేకపోతే మన హృదిని, మన భావ మలినాన్ని జమ్‌జమ్ జలం కూడా- అందులో నిండా మునిగి జలకాలాడినా కడగ జాలదు. అల్లాహ్ ఇలా అంటున్నాడు :

మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుష జంట నుండి పుట్టించాం. తర్వాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవ నీయుడు. దేవుడు సర్వజ్ఞాని, సమస్త విషయాలు తెలిసినవాడు. (అల్-హుజురాత్: 13)

వారు ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారు. "ఈ ఆత్మ నా ప్రభువు ఆజ్ఞతో వస్తుంది. (దీన్ని మీరు గ్రహించలేరని,) మీకు పరిమిత జ్ఞానం ప్రసాదించబడింద"ని చెప్పు. (బనీ ఇస్రాయీల్: 85)

ప్రాణమున్న శరీరం కేవలం కాళ్ళు, చేతులు, రక్త మాంసాలతో కూడిన సమాహారం కాదు. అనంతమైన దృష్టి, అనంతమైన జ్ఞానం, అనంతమైన శక్తి, అనంతమైన ఆనందం కల్గిన ఆత్మకు శరీరం నివాసం. ఆత్మకు సహచరులెవ్వరూ ఉండరు. ఆత్మ ఒంటరిగానే వస్తుంది. ఒంటరిగానే వెళ్ళిపోతుంది. బాహ్య శత్రువులను జయించటం కంటే ఆత్మను జయించటం ముఖ్యం. మానవుని సకల దుఃఖాల నుండి విముక్తి కలిగించే జ్ఞానం, దేనివల్లనైతే సత్యాన్ని తెలుసు కొంటామో, మనసుని అదుపులో పెట్టు కొంటామో, ఆత్మశుద్ధి జరుగుతుందో అదే జ్ఞానం.

ఇమామ్ ఘజాలీ (రహ్మ) ఇలా అన్నారు: ప్రజలు నాలుగు రకాలు:

1) తమకు తెలుసన్న విషయం తమకు తెలిసిన వారు. వీరు పండితులు - మేధావులు. వారిని అనుసరించండి.

2) తమకు తెలియదు అన్న విషయం తమకు తెలిసినవారు. వీరు విద్యార్థులు. వారికి జ్ఞానబోధ చేయండి.

3) తమకు ఏమీ తెలియదన్న విషయం తమకే తెలియని వారు. వీరు మూర్ఖులు - వీరికి దూరంగా ఉండండి.

4) తమకు తెలుసన్న విషయం తమకే తెలియని వారు. వీరు నిద్రావస్థలో ఉన్నవారు. వీరిని జాగరూక పర్చండి.

## జ్ఞానార్జన ధ్యేయం ధర్మోన్నతి, దైవ ప్రసన్నత అవ్వాలి

ధర్మజ్ఞానాన్ని కేవలం దైవప్రసన్నత కోసం ఆర్జించాలి. ఒకవేళ ప్రాపంచిక ప్రయోజనాల కోసం ధర్మ జ్ఞానాన్ని ఆర్జిస్తే అది మహా నేరంగా పరిగణించబడుతుంది. అలాంటి వారు పరలోకంలో స్వర్గ సువాసన కూడా పొందలేరు. అయితే ఆశించకుండానే ఏమైనా ప్రతిఫలం దొరికితే అది వేరే విషయం. దాన్ని పుచ్చుకోవడంలో ఎలాంటి పాపం లేదు.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించారు: దైవప్రసన్నత కోసం నేర్చుకునే విద్యని ఎవడైనా కేవలం ప్రాపంచిక ప్రయోజనాల కోసం నేర్చుకుంటే అలాంటి వ్యక్తి ప్రళయదినాన స్వర్గసువాసన కూడా పొందలేడు. (అబూ దావూద్)

## అజ్ఞానం తెచ్చే అనర్థాలు

అజ్ఞానం వలన పుట్టేవి సంశయాలు, శంకలు, సందేహాలు, కామం (మితిమీరిన కోరిక), క్రోధం (కోపం), లోభం (పిసినారితనం లేదా స్వార్థం), మోహం (ఆకర్షణ వలన కలిగే వలపు), మదం (అహం కారం), మాత్సర్యం (ఈర్ష్య, అసూయ, పగ) మొదలైనవి అజ్ఞానం నుండి పుడతాయి. ఈ అరిషడ్వర్గాలు అనేవి మనిషిని ఎంతటి స్థాయికైనా దిగజారుస్తాయి. మనిషి పతనానికి, ప్రకృతి వినాశనానికి ఇవి కారణమవుతాయి. వీటిని ఎవరైతే కలిగి ఉంటారో వారి మనసు ఎప్పుడూ స్వార్థం సంకుచిత భావాలతో నిండి ఉంటుంది. దుఃఖానికి ఇవి మొదటి హేతువులు. మనిషికి నిజమైన శత్రువులు వారిలో ఉండే అరిషడ్వర్గాలు. ఇవి సామాన్యులను పతనం దిశగా పయనింపజేస్తాయి. మధ్యములను అధములుగా మారుస్తాయి. మనలో ఉన్న సకల దుర్గుణాలు, అనుమానాలు, దుష్ట సంకల్పాలకు మూలం మనలో ఉన్న అజ్ఞానమే. అజ్ఞానం అంటే ప్రతి దానినీ దాని వాస్తవిక స్వరూపంతో కాకుండా మనం అనుకున్నట్టు మనకు అనుకూలంగా అర్థం చేసుకోవడం. అంటే

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

నిజాన్ని తెలుసుకోకుండా మన బుర్రలో ఉన్న ఆలోచనల ప్రకారం ఎదుటి దాన్ని నిర్ణయించడం. ఎలా అంటే అన్నీ మనకు అనుకూలం అవుతాయని భ్రమపడటం. అన్నీ మనకే కావాలని అనుకోవడం. అన్నిటికీ నేనే మూలం నా వల్లనే జరుగుతున్నాయి అని భావించడం, భ్రాంతిలో జీవించడం.

అబూ హురైరా (ర) కథనం: ప్రవక్త (స) ప్రవచనం- ''ప్రజలు బంగారం, వెండి గనుల వంటి వారు. అజ్ఞాన కాలంలో ఉత్తములు, ఇస్లామ్‌లో కూడా ఉత్తములే. అయితే వారు ధర్మజ్ఞానం ఆర్జించి ఉండాలి. (ముస్లిమ్)

వివిధ వంశాలు వివిధ ప్రత్యేకతలు కలిగి ఉన్నారు. ఒక వంశం వారు వీరత్వం కలిగి ఉంటారు. ఒక వంశంలో దయా కారుణ్యాలు ఉంటాయి. ఒక వంశంలో న్యాయం ధర్మం ఉంటాయి. ఒక వంశం వారు నీచులు, ద్రోహులు, పిసినారులు. వంశాల కుటుంబాల గొప్పతనం ఏమీ లేదు. వీటిపై అహంకారం ఏ మాత్రం తగదు. అయితే వీటికితోడు విశ్వాసం మంచి నడవడిక, సత్కార్యాలు, విద్యా జ్ఞానాలు ఉంటే ఎంతో ఉత్తమం. ప్రవక్త (స) ప్రజల్ని గనులతో పోల్చారు. గనుల్లో బంగారం ఉంటే ప్రజలు దాన్ని గుర్తించరు, కానీ ఆ బంగారాన్ని తీసి శుద్ధి చేసిన తర్వాత, ప్రజలు దాన్ని ఎంతో విలువైనవిగా చూస్తారు. అదేవిధంగా మనిషి ఏ కుటుంబం, వంశానికి చెందిన వాడైనప్పటికీ అతనిలో ఉత్తమ నడక, నడవడిక ఉన్నట్లయితే ప్రజలు అతన్ని ఇష్టపడతారు.

అజ్ఞాన మూలంగా అల్లాహ్ ఎవ్వరినీ అందలం ఎక్కించింది లేదు, జ్ఞాన మూలంగా అల్లాహ్ ఎవ్వరినీ అవమానం పాల్జేసింది లేదు అన్నారు దేవుని బెబ్బులి హజ్రత్ అలీ (ర). మనిషి పాలిట అజ్ఞానానికి మించిన శత్రువు లేడు. అజ్ఞానం మహా భయంకర విపత్తు అని కూడా ఆయన సెలవిచ్చారు.

ప్రళయం సమీపంలో జ్ఞానకాంతి పోయి అజ్ఞానాంధకారం వస్తుంది.

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు : ప్రళయ సూచనల్లో ఇవి కూడా ఉన్నాయి. జ్ఞానకాంతి పోయి అజ్ఞానాంధకారం అలుముకుంటుంది. మద్యసేవనం విపరీతంగా పెరిగిపోతుంది. వ్యభిచారం సర్వసామాన్యమవుతుంది. (సహీహ్ బుఖారీ)

హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా తెలియజేశారు : ప్రళయానికి ముందు ఓ కాలం వస్తుంది. అప్పుడు జ్ఞానం పైకి పోయి అజ్ఞానం క్రిందికి దిగుతుంది. హర్జ్ అధికమవుతుంది. హర్జ్ అంటే హత్యాకాండ, రక్తపాతం. (సహీహ్ బుఖారీ)

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు- ''ప్రళయ కాలం సమీపించినప్పుడు సత్కర్మలు తగ్గి పోతాయి. ప్రజల హృదయాల్లో పిసినారితనం, పేరాశలు తిష్ట వేస్తాయి. సర్వత్రా కలహాలు, కల్లోలాలు పెద్ద ఎత్తున చెలరేగుతాయి. హర్జ్ అధికమవుతుంది.'' ప్రవక్త అనుచరులు ఈ మాట విని ''హర్జ్ అంటే ఏమిటి దైవప్రవక్తా?'' అని అడిగారు. '' హర్జ్ అంటే హత్యా రక్తపాతాల''న్నారు దైవప్రవక్త (సల్లం). ఈ మాట రెండు సార్లు అన్నారు.(సహీహ్ బుఖారీ)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఆమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా తెలియజేశారు : దేవుడు (ధర్మ జ్ఞానాన్ని) ప్రజల హృదయాల నుండి తీసివేయడం ద్వారా దాన్ని పైకెత్తుకోడు, జ్ఞానులు (అంటే ధర్మవేత్తలు) అంతరించిన కారణంగా ఆయన జ్ఞానాన్ని పైకి లేపుకుంటాడు. ఈ విధంగా చివరికి ప్రపంచంలో ఒక్క ధర్మవేత్త కూడా మిగిలి ఉండడు. అప్పుడు ప్రజలు అజ్ఞానుల్ని మూర్ఖుల్ని నాయకులుగా చేసుకుంటారు. ధార్మిక విషయాలను గురించి వారినే అడుగుతారు. వారు తమకు ధర్మజ్ఞానం లేకపోయినా ఫత్వాలు (తీర్పులు) ఇస్తారు. ఈ విధంగా వారు స్వయంగా దారి తప్పడమే గాకుండా ఇతరుల్ని కూడా దారి తప్పిస్తారు. (తిర్మిజీ)

## క్వాంటిటీ కాదు క్వాలిటీ ముఖ్యం

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (ర) తన కాలం నాటి ప్రజల్ని ఉద్దేశించి ఇలా అంటూ ఉండేవారు. మీరు శ్వాస పీల్చుకుంటున్న ఈ తరం- ధర్మవేత్తలు, ధర్మ పండితులు అధికంగానూ, ధర్మబోధకులు, వక్తలు తక్కువగానూ ఉన్న తరం. ధర్మ సందేహాలు కూడా తక్కువే. సందేహ నివృత్తికి మార్గాలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పుడు సదాచారణకు కాంక్షల మీద ఆధిపత్యం ఉంది. మీ తరం తర్వాత రాబోయే తరాల్లో ధర్మవేత్తలు, ధర్మ పండితులు తక్కువగానూ, ధర్మబోధకులు, వక్తలు అధికంగానూ ఉంటారు. ధర్మ సందేహాలు అధికమయిపోతాయి. సందేహ నివృత్తి శాతం తగ్గిపోతుంది. అప్పుడు కాంక్షలు సదాచారణల మీద పెత్తనం చెలాయిస్తాయి. చివరి కాలంలో కర్మల పరిమాణంకన్నా, సన్మార్గ నాణ్యత అవసరం ఎక్కువ ఉంటుంది. అంటే ఎవరు ఎన్ని సత్కర్మలు చేశారు అన్నది కాదు, ధర్మానికి, దైవ ప్రవక్త (స) వారి సంప్రదాయానికి అనుగుణంగా చేశారా లేదా అనేది కీలకమయి ఉంటుంది. (అదబుల్ ముఫ్రద్)

# రాజకీయ కల్తీ లేకుండా చూడాలి

- షేక్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం



ఏంటి బాబాయ్, ఈ మధ్య ‘నల్ల పూస’ అయిపోయావు?

‘ఏం చేయమంటావు రా అబ్బాయ్, ఫుడ్ ఇన్ఫెక్షన్ అయ్యి వారం రోజులు ఆసుపత్రిలో ఉన్నా’.

అయ్యో! నాకు తెలియదు బాబాయ్.

అయినా నువ్వు బయట ఏమి తినవుగా, నీకు ఫుడ్ ఇన్ఫెక్షన్ ఎలా అయ్యింది?

నిన్న ఇంట్లో పాయసం చేస్తే కాస్త తిన్న అంతే.

పాయసంలో పాలు, నెయ్యి వాడుతారుగా అదేమైనా కల్తీవి అయ్యి ఉంటాయి.

ఏమో, ఆపై వాడికే తెలియాలి. ఏదేమైనా నలభై వేలు వదిలాయి.

అయినా ఈ రోజుల్లో ఏం తినాలో, ఏం తినకూడదో కూడా తెలియడం లేదు. ఏం తినాలన్నా భయమేస్తోంది.

ఏదైనా అయి ఆసుపత్రికి పోతే, ఉన్నోడు, లేనోడు అని చూడకుండా పిప్పి చేసి వదులుతున్నారు ప్రైవేటు ఆసుపత్రి వాళ్ళు.

నిజమే సాయిబూ గారు. ప్రతిది కల్తీ చేసేస్తున్నారు.

పాలు బలవర్థకమైన ఆహారం అంటే దానిని కూడా కల్తీ చేస్తున్నారు. పిల్లలకు పాలు తాగించాలి అంటే భయం వేస్తోంది.

నిజమే బాబాయ్! ప్రతి ఒక్కరిలో స్వార్థం పెరిగి పోయింది.

ధన సంపాదన కక్కుర్తిలో పడి, తన లాంటి సాటి మనిషి ఏమైపోతే నాకేమిటి అన్న భావన పెరిగిపోయింది.

నిజమేరా! నా చిన్నతనంలో పాలల్లో నీళ్ళు కలపడానికే భయపడే వాళ్ళం. ఈ రోజుల్లో యూరియా, షాంపూ కలిపి సాటి మనిషి ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

అవును బాబాయ్, “పుట్టినప్పుడు బట్ట కట్టలేదు. పోయేటప్పుడు అది వెంటరాదు” అని తెలిసి కూడా వీళ్ళకు ఎందుకు ఇంత ఆశ.

దైవం మన కోసం మట్టిని, పెంట పేడను రకరకాల కూరగాయలు, పండ్లు, ఆహార ధాన్యాలుగా చేసి ఆహారంగా అందించాడు.

“మీకు పశువులలో కూడా ఒక గుణపాఠం ఉన్నది. వాటి గర్భంలో పేడ, రక్తానికి మధ్య ఉన్న ఒక వస్తువును మేము మీకు త్రాగిస్తాము. అంటే స్వచ్ఛమైన పాలు. అది త్రాగేవారికి ఎంతో కమ్మనిది.

(ఇదేవిధంగా) ఖర్జూరపు చెట్లు, ద్రాక్ష తీగెల నుండి కూడా మేము ఒక పదార్థాన్ని మీకు త్రాగిస్తాము. దానిని మీరు మత్తు పానీయంగా కూడా చేసుకుంటారు, పరిశుద్ధమైన ఆహారంగా కూడా. బుద్ధిని ఉపయోగించే వారికి ఇందులో నిశ్చయంగా ఒక సూచన ఉంది”. (ఖురాన్ 16:66-67)

మనమేమో ఆ బలవర్థకమైన పండ్లను కుళ్ళబెట్టి, బ్రాందీ, విస్కీలుగా చేసుకుని తాగి ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నాం.

చూడండి, దేవుడు  మీ ప్రభువు తేనెటీగకు వహీ ద్వారా ఈ విషయాన్ని తెలిపాడు. “కొండలలో, చెట్లమీద, తడికలపై ఈ ఎక్కించబడిన తీగెలలో నీ తెట్టెలను నిర్మించుకో, అన్ని రకాల పండ్లరసాన్ని పీల్చు, నీ ప్రభువు సుగమం చేసిన మార్గాలపై నడుస్తూ ఉండు. ఈ ఈగ కడుపులో నుండి రంగు రంగుల పానకం ఒకటి వెలువడుతుంది. అందులో ప్రజల కోసం వ్యాధి

నివారణ శక్తి ఉన్నది. ఆలోచించేవారికి ఇందులో కూడా నిశ్చయంగా ఒక సూచన ఉంది..

ఇలా దైవం మనకు ఇన్ని రకాల రుచికరమైన ఆహారం లభించే ఏర్పాటు చేస్తే మనమేమో వాటిని కల్తీ చేసి తింటున్నాం.

ఒరేయ్ అబ్బాయ్, సోమరితనం ఎక్కువై ఫాస్ట్‌ఫుడ్‌ల వెంటపడి కూడా మనం ఉన్న ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నాం.

అది కూడా నిజమే తమ్ముడు. మనుష్యుల్లో కష్టపడే తత్వం మాయమైపోయింది. ఏం చేయకుండా ఎలా ఏం దొరుకుతుందా? అని చూస్తున్నారు. శారీరక శ్రమ లేకపోవడం వల్ల రోగాలు బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

నిజమే బాబాయ్, మనిషి ఈ జీవితం శాశ్వతం కాదని, అసలు జీవితం మరణానంతర జీవితం అని మరచి పోయాడు.

వీలైనంత ధనం కూడబెట్టడానికి నానా గడ్డి తింటున్నాడు. సాటి మనిషి జీవితాన్ని నాశనం చేయడానికి కూడా వెనుకాడటం లేదు.

"వ్యాపారం ధర్మ సమ్మతమైన జీవనోపాధి. నిజాయితీ పరులైన వ్యాపారవేత్తలు నాతో పాటు స్వర్గంలో ఉన్నత స్థానంలో ఉంటారు. కానీ కల్తీ, బ్లాక్ మార్కెటింగ్ చేసే వారు నరకం పాలు అవుతారు'' అని ప్రవక్త ముహమ్మద్(స) తెలిపారు:

కొలపాత్రతో ఇస్తే, పూర్తిగా నింపి ఇవ్వండి, తూచినట్లయితే సరైన తరాజుతో తూచండి. ఇది మంచి పద్ధతి. పర్యవసానాన్ని బట్టి కూడా ఇదే ఉత్తమం. (ఖురాన్ 17:35) అంటున్నాడు సృష్టికర్త అయిన దైవం ఖురాన్‌లో.

ఈ రోజుల్లో ఎవడు నిజాయితీగా వ్యాపారం చేస్తున్నాడు? చేస్తే ఈ లోకం ఇలా ఎందుకు ఉంటుంది.

చూడు తమ్ముడు, ఎవరు నీతిగా నిజాయితీగా ఉంటున్నారు అని చూడరాదు. మనమెంత నిజాయితీగా ఉంటున్నామో చూసుకోవాలి.

మనమెంత నిజాయితీగా ఉన్నా, ప్రతిదాన్ని రాజకీయ లబ్ధి కోసం చూస్తున్న నాయకులు ఉన్నంతకాలం ఈ కల్తీ గల్తీయే కాదు భాయ్.

అది కూడా నిజమే ముందు రాజకీయ కల్తీని పరిశుద్ధ పరచడానికి మనమంతా నడుము బిగించాలి.




**ఖుర్‌ఆన్** "హృదయం (గుండె)" గురించి వివరంగా చర్చించింది. సుమారుగా 130 సార్లు హృదయానికి సంబంధించిన వాక్యాలు ఖుర్‌ఆన్‌లో కనిపిస్తాయి. ఖుర్‌ఆన్ గుండెను ఖల్బ్ అని సంబోధించింది. ఖల్బ్ అంటే "తిరగడం" అని అర్థం. "శరీరంలో ఒక మాంసపు ముద్ద ఉంది, అది మంచిగా మారితే శరీరం మొత్తం బాగుంటుంది, కానీ అది చెడిపోతే శరీరం మొత్తం చెడిపోతుంది. అదే హృదయం'అన్నారు ప్రవక్త ముహమ్మద్. ఇస్లాం ప్రకారం మనుషుల హృదయాల్లో వివిధ రకాలు ఉన్నాయి. దృఢమైన హృదయం అంటే అహంకారం లేనిది. జబ్బుపడిన హృదయం అంటే వ్యర్థమైన కోరికలతో నిండి ఉండేది. హృదయంలో అల్లాహ్ పట్ల వినయ విధేయతలు లేనప్పుడూ అవి కఠినంగా మారతాయి. కోరికలకు బానిసైన వారి హృదయాలు ఎప్పుడూ చెడు గురించే ఆలోచిస్తుంటాయి! అయితే కోరికలకు బానిస కాకుండా తమ అవసరాలను హలాల్ మార్గంలో తీర్చుకోవడం ద్వారా ప్రజలు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు దగ్గరవుతారు. కష్టాల్లో, ఆపదలో ఉన్న వారిని చూసినప్పుడు భావోద్వేగానికి లోనై వారికి చేతనైన సాయం చేయాలి. అప్పుడే వారి హృదయం కుదుట పడుతుంది. "అల్లాహ్ స్మరణ ద్వారానే హృదయాలకు తృప్తిని పొందే భాగ్యం లభిస్తుంది (13:28)". అందుకే మంచి హృదయం ఇవ్వమని ఆయనను ప్రార్థించాలి. అల్లాహ్‌ను ఎక్కువగా స్మరిస్తే మన ఉద్దేశాలు, హృదయాలు స్వచ్ఛంగా ఉంటాయి. మన పనిలో హృదయాన్ని పూర్తిగా నిమగ్నం చేయగలిగితే ఖురాన్ చదివినప్పుడు పొందినంత ఆనందం, ఆశీర్వాదం పొందుతాం. హృదయం ఉండీ, విషయాన్ని శ్రద్ధగా ఆలకించే ప్రతి వ్యక్తి ఉన్నతిని సాధిస్తాడు.




## కేంద్రం మమ్మల్ని పట్టించుకోవడం లేదు

కేంద్ర ప్రభుత్వం తమ రాష్ట్రాన్ని చిన్నచూపు చూస్తోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తాజాగా ఆరోపించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తులకు కేంద్రం నుంచి ఎటువంటి చేయూత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఉత్తర బెంగాల్ అల్లకల్లోలంగా ఉంది. పలు జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. కేంద్రం మాకు ఏ మాత్రం సాయం చేయడం లేదు. బీజేపీ నేతలు ఎన్నికలప్పుడు మాత్రమే బెంగాల్ గుర్తొస్తుంది' అని మండిపడ్డారు.

## బీజేపీ సర్కారును తరిమికొట్టండి

హర్యానాలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని ఓటర్లు తమ ఓటుతో తరిమికొట్టాలని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్ 5న జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్, బిజెపిల ఎన్నికల ప్రచారాలు జోరందుకున్నాయి. అంబాలాలోని నారైంగరాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు, క్రీడాకారులు, సైనికులు యావత్ దేశ గౌరవాన్ని నిలబెడుతుండగా, బిజెపి మాత్రం వారిని ఎప్పుడూ అవమానిస్తూనే ఉంది. గడచిన పదేళ్లలో రైతులపై లాఠీచార్జీ చేసి దారుణంగా ప్రవర్తించారు. రైతులు డిమాండ్ చేస్తున్న ఎంఎస్‌పి హామీని కూడా ఇవ్వలేదు. అసలు హర్యానా ప్రజల కోసం బిజెపి ఏం చేసిందో చెప్పాలని ప్రియాంక డిమాండ్ చేశారు.

## అస్సాం ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

అస్సాం ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేసింది. తమ అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దంటూ సుప్రీం కోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ధిక్కరించి తమ ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేసిందని ఆరోపిస్తూ 47 మంది పౌరులు అస్సాం ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారించిన జస్టిస్‌లు బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం, దీనిపై మూడు వారాల్లో స్పందన తెలియజేయాలంటూ అస్సాం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## ఆక్రమణల పేరుతో పవిత్ర స్థలాల కూల్చివేత

ఆక్రమణల పేరుతో గుజరాత్‌లోని గిర్ సోమ్‌నాథ్ జిల్లా యంత్రాంగం కూల్చివేత డ్రైవ్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా తొమ్మిది మసీదులు, పవిత్ర కట్టడాలు, 45 ఇండ్లను నేలమట్టం చేసింది. ఇందులో కొన్ని వందల ఏండ్ల చరిత్రను కలిగి ఉన్న నిర్మాణాలు కూడా ఉండటం గమనార్హం. కూల్చివేతలపై గుజరాత్ మైనారిటీ కోఆర్డినేషన్ కమిటీ స్పందించింది. ఈ మేరకు గుజరాత్ ముఖ్య మంత్రి భూపేంద్ర పటేల్‌కు లేఖ రాసింది. ముస్లింలకు న్యాయం చేయాలని సీఎంను కోరింది. హాజీ మాగ్రోల్ షా దర్గా జునాగఢ్ రాష్ట్ర రెవెన్యూ రికార్డుల్లో 1924లో నమోదైందని లేఖలో పేర్కొన్నది. కేసులు హైకోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్నప్పటికీ.. కూల్చివేత డ్రైవ్‌ను చేపట్టారనీ, ఇది అన్యాయమైన చర్య అని కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. కూల్చివేత చర్యలపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్య చట్టవిరుద్ధమని గుజరాత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నూస్రత్ పంజా ఆరోపించారు. కూల్చివేతలు జరిగిన కట్టడాలకు 700, 800 ఏండ్ల చరిత్ర ఉన్నదనీ, అవి వక్ఫ్ ఆస్తులుగా రక్షించబడుతున్నాయని నూస్రత్ అన్నారు. అయితే, న్యాయస్థానం తీర్పులను కలెక్టర్, ప్రభుత్వం తప్పుగా ఆపాదించి ఈ నిర్మాణాలను కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

## జమిలికి మూడు బిల్లులు

జమిలి ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు, ఒక సాధారణ బిల్లును తీసుకురానుంది. ప్రతిపాదిత మొదటి రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడానికి సంబంధించింది. ఇందుకోసం 82ఎ, 83(2) అధికరణలకు సవరణలు చేయాల్సి ఉంటుంది. 327 అధికరణకు సవరణ చేసి 'ఏక కాల ఎన్నికలు' అనే పదాన్ని పొందుపరచాల్సి ఉంటుంది. రాష్ట్రాల వ్యవహారాలకు సంబంధించిన ప్రతిపాదిత రెండో రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటు పురపాలికలు, పంచాయతీలకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన నిబంధనలకు సంబంధించినది. మూడో బిల్లు శాసనసభలు కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇతర రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభకు పేర్కొన్న విధంగానే నిబంధనలను సరి చేయడానికి సంబంధించినది.




## దాడులు ఆపండి

లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే నిలిపివేయాలని ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి పిలుపునిచ్చారు. ప్రస్తుతం లెబనాన్‌లోనే ఉన్న బారోట్.. ఇజ్రాయిల్ దాడులను పెంచిన తర్వాత ఆ దేశాన్ని సందర్శించిన మొదటి సీనియర్ విదేశీ దౌత్యవేత్త. ఆయన లెబనాన్ ప్రధానమంత్రి నజీబ్ మికాటిని కలుసుకున్న సందర్భంగా "ఇస్రాయీల్ దాడులను తక్షణమే నిలిపివేయాలని" పారిస్ కోరినట్లు ఆయన తెలిపారు. యుఎన్ ప్రత్యేక సమన్వయకర్త, దక్షిణాదిలోని యుఎన్ శాంతి పరిరక్షక దళ సభ్యులను బారోట్ కలవనున్నారు. లెబనాన్‌లో రెండవ ఫ్రెంచ్ పౌరుడు చంపబడ్డాడని ఫ్రాన్స్ ధృవీకరించిన కొద్దిసేపటికే ఆయన లెబనాన్ కు వెళ్లారు.

## ఇస్రాయీల్‌తో తెగతెంపులు చేసుకోండి

గాజా, లెబనాన్‌లపై విచక్షణారహితంగా దాడులకు దిగుతూ వేలాది మంది అమాయకులను పొట్టన బెట్టుకుంటున్న ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని ముస్లిం దేశాలకు ఇరాన్ విజ్ఞప్తి చేసింది. ఇజ్రాయిల్ రాయబారులను బహిష్కరించి, ఇజ్రాయిల్ దేశంపై ఆంక్షలు విధించాలని కోరింది. ఈ మేరకు ఇరాన్ రక్షణ మంత్రి బ్రిగేడియర్ జనరల్ అజీజ్ నజిర్ లెబనాన్ దాడుల్లో గాయపడిన వారిని పరామర్శించినపుడు ఈ వ్యాఖ్యలు చేశారు. కేవలం ఇజ్రాయిల్ చేస్తున్న నేరాలను నిరసిస్తే సరిపోదు, ఈ ఊచకోతను ఆపేలా ఆ దేశంపై ఒత్తిడి తీసుకు రావాలంటే మరిన్ని చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. ఆ దేశంతో రాజకీయ సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని, రాయబారులను బహిష్కరించాలని, పరస్పర ఆర్థిక లావాదేవీలను ఆపాలని కోరారు. బాంబు దాడులతో, మూకుమ్మడి హత్యలతో ప్రతిఘటనా శక్తిని అణచివేయలేరని వ్యాఖ్యానించారు.

## జపాన్ కొత్త ప్రధానిగా కిషిదా

జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిదా వారసుడిగా ఆ దేశ రక్షణ శాఖ మాజీ మంత్రి షిగెరు ఇషిబా (67) ఎన్నికయ్యారు. అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికలో విజయం సాధించిన ఇషిబా.. వచ్చేవారం జపాన్ కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2021లో కిషిదా ఎల్‌డీపీ అధ్యక్షునిగా ఎన్నికైన విషయం విదితమే. ఆయన మూడేండ్ల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుండటంతో ఎల్‌డీపీ అధ్యక్ష పదవికి తాజాగా ఎన్నిక నిర్వహించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో కిషిదా ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు. ఎల్‌డీపీ అధ్యక్ష పదవికి ఇద్దరు మహిళలు సహా మొత్తం 9 మంది పోటీపడ్డారు. ప్రస్తుత ప్రధాని కిషిదా, ఆయన మంత్రి వర్గం వచ్చే నెల 1న రాజీనామా చేయనున్నది. అనంతరం ఇషిబా నేతృత్వంలో కొత్త మంత్రివర్గం కొలువుదీరనున్నది.

## మా ప్రాంతాన్ని విడిచి వెళ్ళే ప్రసక్తే లేదు

"పాలస్తీనా మా మాతృభూమి, మేం ఆ ప్రాంతాన్ని వీడి వెళ్ళం. వెళ్ళాల్సిన వారు ఎవరైనా వున్నారు అంటే, వారు దురాక్రమణకు పాల్పడినవారే." అని పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ స్పష్టం చేశారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 79వ వార్షిక సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. ఇజ్రాయిల్ పూర్తి స్థాయి యుద్ధానికి దిగుతూ పాలస్తీనియన్లను ఊచకోత కోస్తోందని ఆయన విమర్శించారు. గాజాలో అమాయకులైన పౌరులను చంపలేదని ఇస్రాయిల్ ప్రధాని నెతన్యాహు అనడాన్ని ఆయన తోసిపుచ్చారు. అలా అయితే 15వేల మందికి పైగా చిన్నారులను పొట్టనబెట్టుకున్నారు, మరి వారెవరు? అని ప్రశ్నించారు."ఈ నేరాలు ఆపండి, ఇప్పుడే ఆపాలి. మహిళలను, చిన్నారులను చంపడాన్ని మానాలి. ఊచకోతకు స్వస్తి పలకాలి. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు పంపించడం ఆపాలి. ఇవన్నీ కొనసాగించడం ఇకపై కుదరదు. ఈనాడు మా ప్రజలకు జరుగుతున్నదానికి యావత్ ప్రపంచం బాధ్యత వహించాలి" అని అబ్బాస్ స్పష్టం చేశారు. ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాలని, ఐక్యరాజ్య సమితి నుండి బహిష్కరించాలని అబ్బాస్ అంతర్జాతీయ సమాజాన్ని కోరారు.

## ఇస్రాయీల్ దాష్టీకంపై ప్రపంచ దేశాల ఆగ్రహం

లెబనాన్‌పై ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణపూరిత దాడులు, హిజ్బుల్లా నేతల హత్యలను అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల తదనంతర పర్యవసానాలకు ఇస్రాయిల్, దానికి అండదండలిస్తున్న అమెరికా పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించాయి. పశ్చిమాసియాను అస్థిరపరిచే యూదు దురహంకార ఇజ్రాయిల్ దాడులను తక్షణమే ఆపాలని అవి డిమాండ్ చేశాయి. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దురాక్రమణపూరిత దాడులు, హిజ్బుల్లా చీఫ్ హత్యను అరబ్బు దేశాలతో బాటు చైనా, రష్యా, క్యూబా, వెనిజులా, అర్జెంటీనా, కొలంబియా, దక్షిణాఫ్రికా తదితర దేశాలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా మాత్రం ఇది ఉగ్రవాదుల చేతిలో బలైన వేలాది మంది అమాయక పౌరులకు చేకూరిన న్యాయం అని అభివర్ణించింది. అమెరికా మిత్ర దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు సైతం ఈ దాడుల తాలూకు పర్యవసానాల గురించి ఆందోళన వ్యక్తం చేశాయి.

# శాంతియుత జీవనమే మనుగడకు భరోసా

**ఉమ్మైమా**

**శాంతిని పాటించడం మనుషులకైనా, సమాజాలకైనా, దేశాలకైనా ఎంతో అవసరం. ప్రపంచ ఉనికికి, మానవాళి మనుగడకు ఇది తప్పనిసరి అవసరం. అందుకే పవిత్ర గ్రంథమైన ఖుర్ఆన్ శాంతిని మానవ జీవిత మార్గదర్శక సూత్రంగా అభివర్ణించింది.**

పవిత్రత, శాంతి పరస్పర ఆధార అంశాలు. అందుకే పవిత్రత ప్రాముఖ్యత గురించి కూడా ఖురాన్ నొక్కి చెప్పింది : “హత్యకు బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే” అని ఖుర్ఆన్ (5:32) పేర్కొంది. మనిషి ప్రాణం విలువైనదని.. శాంతి అనేది జీవిత రక్షణకు పునాది అని తెలిపింది. హింసాత్మక సమయాల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోతారు, సమాజ నిర్మాణం విచ్ఛిన్నమవుతుంది. శాంతి లేకపోవడం మనిషి ఉనికిని దెబ్బ తీస్తుంది, నాగరికత పురోగతికి ఆటంకం కలిగిస్తుంది. అందుకే సామాజిక సమన్వయం, న్యాయం-సమానత్వం ఇవి రెండూ శాంతియుత సమాజంలో అంతర్భాగాలుగా ఉండాలని ఖుర్ఆన్ పేర్కొంటోంది. వాటిని ప్రోత్సహిస్తుంది.

“విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కోసం సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనై న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవ భక్తికి సరిసమానమైనది” అని ఖుర్ఆన్ (5:8) తెలిపింది. సమాజంలో సమ న్యాయం అమలవకుండా శాంతియుత సహ జీవనం అసాధ్యం. అలాగే శాంతి లేకుండా న్యాయాన్ని సాధించలేము. శాంతి లేని ప్రపంచంలో అణచివేత ఉంటుంది, ఇది సామాజిక అశాంతికి దారి తీస్తుంది. “భూమిని మీ అధీనంలో ఉంచినవాడు ఆయనే, కనుక దాని మీద తిరగండి, దేవుడు ప్రసాదించిన ఆహారాన్ని తినండి” (ఖుర్ఆన్ 67:15). విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక అవకాశాల ప్రాప్యత వంటి మానవ అభివృద్ధికి అవసరమైన పరిస్థితులను ఇస్లామ్ అనుమతిస్తుంది. అలజడితో కూడిన వాతావరణం మానవాళి పురోగతికి తీవ్ర ఆటంకం కలిగిస్తుంది.

### పర్యావరణ పరిరక్షణ అవసరం

పర్యావరణ పరిరక్షణ మనుషుల కర్తవ్యమని ఖురాన్ చెప్తోంది. “ఆయన భూమిలో పర్వతాలను మేకులుగా పాతాడు, భూమి మిమ్మల్ని తీసుకొని దొర్లిపోకుండా ఉండాలని. ఆయన నదులను ప్రవహింప జేశాడు, సహజ మార్గాలను నిర్మించాడు, మీరు సరైన మార్గం పొందటానికి. ఆయన భూమిలో మార్గం చూపే సంకేతాలను పెట్టాడు. నక్షత్రాల ద్వారానూ ప్రజలు మార్గం తెలుసుకుంటారు”. (ఖుర్ఆన్ 16:15)

### సర్వమత సామరస్యం

ఇతర మత విశ్వాసాలను అనుసరించే ప్రజలతో శాంతియుత సహ జీవనాన్ని గడపాలని ముస్లింలను ఖురాన్ ప్రోత్సహిస్తుంది. “గ్రంథ ప్రజలతో వాదించకు, ఉత్తమమైన రీతిలో తప్ప- అయితే వారిలోని దుర్మార్గులతో మాత్రం కాదు- వారితో ఇలా అను, “మేము మా వద్దకు పంపబడిన దానినీ విశ్వసించాము, మీ వద్దకు పంపబడిన దానినీ విశ్వసించాము. మా దేవుడూ, మీ దేవుడూ ఒక్కడే, మేము ఆయనకే విధేయులం. (ఖుర్ఆన్ 29:46). అన్ని మతాల పెద్దలు కలిసి జరిపే చర్చలు, వారు ప్రజలకు మత సామరస్యంపై కల్పించే అవగాహన శాంతిని పెంపొందిస్తుంది.

మనుషుల మనుగడ, సమాజంలో సమ న్యాయం అమలు, పర్యావరణ పరిరక్షణ, సర్వమత సామరస్యం ఇవన్నీ శాంతి భావనతో ముడిపడి ఉన్నాయి. ఇందుకోసం శాంతి గురించి ఖుర్ ఆన్ చేసిన బోధనలను పాటించడం ఎంతో అవసరం.

### ఖుర్ఆన్ పిలుస్తోంది శాంతి నిలయం వైపునకు..

అల్లాహ్ మిమ్మల్ని దారుస్సలామ్ (శాంతి నిలయం) వైపునకు ఆహ్వానిస్తున్నాడు. (మార్గదర్శకత్వం ఆయన చేతుల్లో ఉంది) ఆయన తాను కోరుకున్న వారికి సరియైన మార్గం చూపుతాడు. (ఖుర్ఆన్ 10:25)

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**